ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 18 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సెహరీ (బుధవారం ఉదయం)
రాయచోటి	6.30	5.01
మదనపల్లె	6.31	5.05
రాజంపేట	6.28	5.07
పీలేరు	6.29	4.58

పాతాళంలో జలం...

జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి పడి పోతున్నాయి. జిల్లా భూగర్భజలాలు, నీటి తనిఖీ శాఖ లెక్కల ప్రకారం గత ఏడాదితో పోల్చితే 1.94 మీటర్లు లోతుకుపోయాయి. 10 మీటర్ల నుంచి 20 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయిన మండలాలు జిల్లాలోని 30 మండలాల్లో 19 ఉన్నాయి. దీనిని బట్టే ఎంత ప్రమాదకర స్థాయిలో భూగర్భజలాలు పడిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. మండుతున్న ఎండలతో పోటీ పడుతూ భూగర్భజలాలు పడిపోతుండటంతో సాగులో ఉన్న పంటలు ఎండుముఖం పడుతున్నాయి. పంట చేతి కొచ్చే దశలో నీళ్లు తక్కువ కావడంతో టమోట, దోస, కర్బూజ పంటలతో పాటు మామిడితోటలను సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

- అడుగంటుతున్న భూగర్భజలాలు..
- 20 మీటర్ల లోతుకు పడిపోయిన మండలాలు 19
- వ్యవసాయ బోర్లలో తగ్గిపోతున్న నీళ్లు
- ఎండుముఖం పడుతున్న పంటలు



పైపులు తీసుకెళ్తున్న వెంకటశివ



సాగులో ఉన్న దోస పంట

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితులతో జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో భూగర్భజలాలు పడిపోతున్నాయి. దీంతో బోర్లలో నీరు రాకపోవడంతో పంటలు సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. భూగర్భజలాలు, నీటి తనిఖీ శాఖ నివేదికల ప్రకారం ఈ ఏడాది సాధారణ వర్షపాతం 676.9 మిల్లీమీటర్లు ఉంటే... 767.4 మిల్లీమీటర్లు నమోదైంది. అయితే కొన్ని మండలాల్లోనే ఎక్కువ వర్షపాతం నమోదైంది. కొన్ని చోట్ల అసలు వర్షమే పడలేదు. 2024లో 697.7 మిల్లీ మీటర్లకు గానూ.. 481.9 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఈ నేపధ్యంలో గత ఏడాది ఫిబ్రవరి నుంచి జిల్లాలో భూగర్భజలాల లోతు దారుణంగా పడిపోయింది. గత ఏడాది ఫిబ్రవరిలో సగటు 11.18 మీటర్లు ఉండగా.. ప్రస్తుతం సగటు 13.12 మీటర్లకు దిగజారిపోయింది. గత సంవత్సరంతో పోల్చితే 1.94 మీటర్లు తగ్గిపోయింది. ఈ ఏడాది జనవరి నుంచి నెల రోజుల వ్యవధిలో ఫిబ్రవరి నాటికి 2.6 మీటర్లు లోతుకు పడిపోయింది. ప్రస్తుతం జిల్లాలోని 30 మండలాల్లో ఐదు మీటర్ల లోపు నీటిమట్టం పడిన మండలాలు రాయచోటి, రామసముద్రం, పీలేరు, 5-10 మీటర్ల లోపు లక్కిరెడ్డిపల్లె, రామాపురం, మదనపల్లె, కలకడ, కోడూరు, పెద్దమండ్యం, వీరబల్లి మండలాలు ఉన్నాయి. 10-20 మీటర్ల లోపు కలికిరి, బి.కొత్తకోట, నిమ్మనపల్లె, కేవీ పల్లె, పీటీఎం, ములకలచెరువు, ఓబులవారిపల్లె, నందలూరు, టి.సుండుపల్లె, సంబేపల్లె, గుర్రంకొండ, చిన్నమండెం, రాజంపేట, కురబలకోట, చిట్వేలి, తంబళ్లపల్లె, గాలివీడు, పెనగలూరు, పుల్లంపేట ఉన్నాయి. 20- 30 మీటర్ల లోపు వాల్మీకిపురం మండలంలో భూగర్భజలాల మట్టం పడిపోయింది.



ఎండుతున్న వేరుశనగ పంట

చుక్క నీళ్లు లేని చెరువులు, కుంటలు, బావులు

జిల్లాలో ప్రధానంగా వర్షాధారంగానే పంటలు పండుతాయి. ఇక్కడ చెరువులు, కుంటలు, బావుల కింద పంటలు సాగు చేస్తారు. జిల్లాలో కొన్ని మండలాలు మినహా చాలాచోట్ల సాధారణ స్థాయి కంటే తక్కువగానే వర్షపాతం నమోదైంది. దీంతో దాదాపు ఏ చెరువు, కుంట నిండలేదనే చెప్పవచ్చు. ఈ ప్రభావంతో బావులు పూర్తి స్థాయిలో అడుగంటిపోయాయి. వేలాది ఎకరాలు బీళ్లుగా ఉన్నాయి. అయితే పలువురు రైతులు అప్పులు చేసి బోర్లు వేసి పంటలు సాగు చేశారు. ఈ పంటలు మరో 15 నుంచి 25 రోజుల్లోపు చేతికి వచ్చే దశలో ఉన్నాయి. రెండు మూడు రోజులుగా చాలాచోట్ల వ్యవసాయబోర్లలో సన్నగా నీళ్లు వస్తున్నాయి. ఈ నీళ్లతో పంటలు సాగయ్యే పరిస్థితి లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నమండెం మండలంలో జనవరి, ఫిబ్రవరిలో వేలాది ఎకరాల్లో టమోటా సాగు చేశారు. పంట పెట్టిన ఒకటి, రెండు నెలల వ్యవధిలోనే నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఏప్రిల్, మే నెలల్లో ఎలా చేయాలని ఆందోళన చెందుతున్నారు. ఈ పంటలను కాపాడుకునేందుకు కొన్ని చోట్ల రైతులు తమ పక్కనే ఉన్న రైతుల బోర్ల నుంచి నీళ్లు కొంటున్నారు. మరికొందరు రైతులు ఇప్పటికే ఉన్న బోర్లలో అదనంగా పైపులు దింపుతున్నారు. ఇందుకు వేల రూపాయలు ఖర్చు చేసి మరో 10, 15 రోజుల పాటు పంటలను కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

15రోజుల్లో పంట చేతికి వస్తుంది

నాలుగైదు నెలల క్రితం బోరు వేశాను. నీరు పుష్కలంగా పడ్డాయి. దానికి మోటారు, ట్రాన్స్‌ఫార్మర్ కోసం లక్షలు ఖర్చు చేశాము మూడు ఎకరాలలో దోస పంట సాగు చేశాను. ఇందుకోసం దాదాపు 3.60 లక్షలు ఖర్చు చేశాను. పంట సాగు చేసి 45 రోజులు అవుతోంది. ఇంకో 15 రోజులు ఉంటే దోస పంట పూర్తయ్యేది. రెండు రోజుల నుంచి బోరులో నుంచి ఒక సారిగా నీళ్లు తగ్గిపోయాయి. దీంతో విధి లేక పక్కన ఉన్న ఇద్దరు ముగ్గురి బోర్ల నుంచి నీళ్ల వేసుకుంటే. పంట అయిపోతుందని, 60 పైపులు కొనుక్కొచ్చాను. మా గ్రామంలో చాలా మంది దోస, కర్బూజ సాగు చేశారు. ఇప్పుడు వీళ్లందరి పరిస్థితి నాలాగే ఉంది.

-వెంకటశివ, చిన్నమండెం

15 రోజులుగా నీళ్లతో ఇబ్బంది



వ్యవసాయ బోరులో రెండు ఇంచులు నీళ్ల వచ్చేవి. ఈ నమ్మకంతో లక్ష రూపాయలు వ్యయం చేసి నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. 15 రోజులుగా బోరులో నీళ్ల ఉన్నఫళంగా తగ్గాయి. పంట తడికి నీళ్ల పరిపోవడం లేదు. ఎండలు ఎక్కువగా ఉన్నాయి. మరో 20 రోజుల్లో పంట చేతికి వస్తుంది. అంతవరకు పంటను కాపాడుకోవాలి.

-ఈశ్వరయ్య, సంబేపల్లె

మామిడి చెట్లను కాపాడుకోవడం కష్టంగా ఉంది



నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఇందులో 300 మామిడి చెట్లు ఉన్నాయి. ఇంకా కొంత భూమిలో పశువుల కోసం గడ్డి వేశాను. మామిడి చెట్లతో పాటు, ఇతర పంటల కోసం ఐదు సంవత్సరాల క్రితం 700 అడుగుల బోరు వేశాను. గత నెల వరకు అందులో నుంచి నీళ్లు బాగా వచ్చాయి. మార్చి నెల ప్రారంభం నుంచే బోరు బావిలో నీళ్ల రావడం తగ్గిపోయాయి. దీంతో మామిడి చెట్లను కాపాడుకోవడం కష్టమవుతోంది. వేరే బోరు వేద్దాం.. అనుకున్నా.. అందులో కూడా నీళ్ళు పడతాయో.. లేవో తెలియదు. బోరు వేయాలంటే.. ఎంతలేదన్నా.. మూడు లక్షలు ఖర్చు అవుతుంది. అంత పెట్టి ఖర్చు బోరు వేసినా.. నీళ్ల పడకపోతే ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

-నక్కల రామక్రిష్ణారెడ్డి, మూలివీడు

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- అధికారులు తీరు మార్చుకోకపోతే సహించేది లేదు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల దగ్గర నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 300 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో కొంతమంది ఎంపీడీవోలు, తహసీల్దార్ల తీరు బాగోలేదని తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు

అనారోగ్య కారణాల వల్ల తన కుడికాలును తొలగించారని పేదవాడినైన తనకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన హజరత్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. పింఛన్ పొందుతున్న తన భర్త ఏడు నెలల క్రితం మరణించాడని, ప్రస్తుతం తనకు పింఛన్ మంజూరు చేయాలని లక్కిరెడ్డిపల్లెకు చెందిన కోనేటి అంజనమ్మ విన్నవించుకుంది. మదనపల్లె మండలం నక్కలదిన్నె గ్రామంలో రోడ్డుకు అడ్డంగా గోడ కట్టారని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

- మొదటిరోజు 530 మంది గైర్హాజరు
- 121 పరీక్షా కేంద్రాల్లో 21,766 మంది విద్యార్థులు హాజరు

రాయచోటిటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 22,296 మంది విద్యార్థులకు గానూ మొదటి రోజు 21,766 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 530 మంది గైర్హాజరయ్యారు. అందులో రెగ్యులర్ విద్యార్థులు 253 మంది, ప్రైవేట్ విద్యార్థులు 297 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలను అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. 121 మంది చీఫ్ సూపర్ సూపరింటెండెంట్లు, 121 డిపార్టుమెంట్ ఆఫీసర్లు, 11 ఫ్లయింగ్ స్క్వాడ్, 121 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్‌లు, 25 సిట్టింగ్ స్క్వాడ్, 1250 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలకు పర్యవేక్షిస్తూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు పరీక్ష జరిగే సమయంలో విద్యార్థులకు ఎటువంటి రవాణా ఇబ్బందులు లేకుండా ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు చేశారు. పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో పదవ తరగతి విద్యార్థులు



మదనపల్లెలోని జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు 498 ఎకరాలు

- రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం



భూసేకరణ కోసం రైతులతో మాట్లాడుతున్న అధికారులు (ఫైల్)

రాయచోటి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం వంగిమళ్ల గ్రామ పరిధిలో ఏర్పాటు చేయనున్న వీరబల్లి ఆఫ్ స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుకు 498.62 ఎకరాల భూమిని కేటాయిస్తూ సోమవారం రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. 1800 మెగావాట్ల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు కోసం వంగిమళ్ల రాచపల్లి పంచాయతీలో 498.62 ఎకరాలు అవసరమని గతంలో జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు కోసం రైతుల నుంచి ఇప్పటికే భూసేకరణ మొత్తం పూర్తయినట్లు సమాచారం. అయితే నిర్వాసితులకు ఇంకా ఎటువంటి నష్టపరిహారం అందలేదు. ఆస్తా ఎనర్జీ గ్రీన్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనుంది.

మంచంపై నుంచే పరీక్షకు...

- రోడ్డు ప్రమాదంలో గాయపడి...



పరీక్ష రాసేందుకు లహిత్‌కుమార్‌రెడ్డిని మంచంపై మోసుకొస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గట్టు పంచాయతీ ఆకులవారిపల్లెకు చెందిన తిరుమలరెడ్డి కుమారుడు లహిత్‌కుమార్‌రెడ్డి పదో తరగతి పరీక్షను సహాయకుడి సహాయంతో మంచంపై పడుకునే రాశాడు. వివరాలిలా ఉన్నాయి. గట్టు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న లహిత్‌కుమార్‌రెడ్డి ఈనెల 14న ద్విచక్ర వాహనంలో వెళుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు మదనపల్లెకు తరలించి చికిత్స చేయించారు. నడవలేని, కూర్చోలేని పరిస్థితిలో ఉన్నాడు. మంగళవారం ప్రారంభమైన తెలుగు పరీక్షకు కుటుంబీకులు ఓ కారులో తనకు కేటాయించిన పరీక్షా కేంద్రమైన ఏపీ మోడల్ స్కూల్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడే హాస్టల్‌లో నుంచి ఓ మంచం తెచ్చి అందులో పడుకోబెట్టి ఓ సహాయకుడిని ఏర్పాటు చేసి పరీక్ష రాసేందుకు అధికారులు అనుమతించారు. దీంతో ఆ విద్యార్థి మొదటి పరీక్ష పూర్తి చేశాడు.

క్వారీ ఖాళీ చేస్తున్నారు..!

- అధికారం పోయినా తగ్గని పెద్దల హవా
- బి.కొత్తకోట క్వారీ నుంచి కంకర తరలింపు
- అధికారులను లెక్కచేయని ప్రైవేటు సైన్యం
- అడ్డుకునే సాహసం చేయని అధికార పార్టీ నేతలు



క్వారీలో నిల్వ ఉన్న స్టాకు



బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లె వద్ద ఉన్న క్వారీ క్రషర్




టిప్పర్‌లతో తరలిస్తున్న కంకర

మదనపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన పెద్దిరెడ్డి కుటుంబం ఇప్పటికీ అదే పంథాలో నడుస్తోందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వంలోని పెద్దలే కాదు.. స్థానికంగా నాయకులు కూడా వీరిని అడ్డుకునే పరిస్థితి లేకపోవడంతో ముఖ్యంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో వారిదే హవా కొనసాగుతోంది. పోలీసు నుంచి రెవెన్యూ వ్యవస్థ వరకూ వైసీపీ నేతల మాటలే చెల్లుబాటు అవుతున్నట్లు స్థానికంగా చెబుతున్నారు. వీరి ఆగడాలు, దౌర్జన్యాలు అడ్డుకునేవారు లేకపోవడంతో ఇప్పటికీ ఇక్కడ పెద్దిరెడ్డి రాజ్యాంగం నడుస్తోందనే ప్రచారం జరుగుతోంది. బి.కొత్తకోట మండలం శెట్టిపల్లె సమీపంలో ఆగిపోయిన క్వారీ క్రషర్ నుంచి నాలుగు రోజులుగా నిల్వ ఉన్న స్టాకును ఖాళీ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయిన వెంటనే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం, వారి అనుచరులు నిర్వహిస్తున్న కంకర మిషన్లు ఆగిపోయాయి. అప్పటికే అక్కడ కొట్టిపెట్టిన డస్ట్, 40 ఎంఎం, 20 ఎంఎం, 12 ఎంఎం, 6 ఎంఎం, జీరో సైజు డస్ట్ స్టాకు రవాణా ఆగిపోయింది. పీఎల్ఆర్ కంపెనీ ఇక్కడ పనులు కూడా చేసే పరిస్థితి లేకపోవడంతో క్వారీ పనులు ఆగిపోవడంతో వీటికి ఉపయోగించే మిషన్లు, ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు, ఇతర వాహనాలు, కార్మికులను కూడా బయటి ప్రాంతాలకు తరలించేశారు. అయితే బి.కొత్తకోటకు సమీపంలోని క్వారీ క్రషర్‌లో ఉన్న స్టాకును వారం రోజులుగా పెద్దిరెడ్డి మనుషులు తరలిస్తున్నట్లు చెబుతున్నారు. హంద్రీ-నీవా పనుల పేరుతో కొంత, బయటి ప్రాంతానికి మరికొంత రాత్రి, పగలు అనే తేడా లేకుండా తరలిస్తున్నారు. అయితే అటు అధికారులు, ఇటు పోలీసులు, మరో వైపు అధికార పార్టీ నేతలు అడ్డుకునే సాహసం చేయడం లేదని చెబుతున్నారు. ఇక్కడున్న క్వారీని మరొకరి నుంచి లీజుకు తీసుకుని పెద్దిరెడ్డి కుటుంబం క్రషర్ దందా నడపగా, అధికారం పోయినా ఇప్పటికీ అదే పని చేస్తున్నారని స్థానికంగా తీవ్రమైన చర్చ నడుస్తోంది. కాగా వీటికి అనుమతి లేదని గనుల శాఖ చెబుతున్నా లెక్క చేయకుండా తరలించేస్తున్నారు. విషయం తెలుసుకున్న మైనింగ్ అధికారులు అక్కడికి వెళితే మాకు తెలియదు.. ఎవరు మీరు? ఎందుకొచ్చారు? మేం కూలికి ఉన్నాం.. ఓనర్ల ఫోన్ నెంబర్ కూడా లేదనే సమాధానం చెబుతున్నారని గనుల శాఖ వారు అంటున్నారు.

తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్నం

- కస్తూర్బా సిబ్బంది తప్పిదం
- ఇబ్బంది పడ్డ విద్యార్థిని
- అధికారుల చొరవతో తిరిగి తెలుగు ప్రశ్నపత్రం



BOARD OF SECONDARY EDUCATION
ANDHRA PRADESH :: AMARAVATI
SSC PUBLIC EXAMINATIONS, MARCH - 2025
HALL TICKET
REGULAR

విద్యార్థిని నమ్రుత హాల్ టికెట్

రాయచోటి/వీరబల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నమ్రుత అనే విద్యార్థిని వీరబల్లిలోని జడ్పీ హైస్కూల్‌లోని 10వ తరగతి పరీక్షా కేంద్రంలో తీవ్ర ఇబ్బందులకు గురైంది. ఈమె హాల్ టికెట్‌లో తప్పిదం వల్ల ఆ విద్యార్థిని ప్రశ్నపత్రమే మారిపోయింది. హాల్‌టికెట్ వచ్చి వారం రోజులు గడుస్తున్నా హాల్ టికెట్‌లో మొదటి పరీక్ష తెలుగు లేక హిందీనా చూసుకోలేని దయనీయ పరిస్థితి ఆ పాఠశాలలో నెలకొంది. హాల్ టికెట్‌లో తెలుగు పరీక్షకు బదులు హిందీ పడడంతో విద్యార్థినికి అధికారులు హిందీ ప్రశ్నపత్రాన్ని ఇచ్చారు. మొదటిరోజు తెలుగు సబ్జెక్టు పరీక్ష రాయాల్సి ఉండగా ఆమెకు హిందీ సబ్జెక్టు ప్రశ్నపత్రం ఇచ్చారంటూ ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇన్విజిలేటర్ వెంటనే ఈ విషయాన్ని చీఫ్ డిపార్టుమెంటల్ అధికారి ఓబుల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న చీఫ్ డిపార్టుమెంట్ అధికారి ఓబుల్‌రెడ్డి వెంటనే డీఈవో సుబ్రమణ్యం దృష్టికి తీసుకెళ్లారు. డీఈవో ఆదేశాల మేరకు అప్పటికప్పుడే మరో విద్యార్థి నుంచి బుక్లెట్‌ను, ప్రశ్నపత్రాన్ని బయటకు తీసుకువెళ్లి జిరాక్స్ తీసి బాధిత విద్యార్థిని నమ్రుతకు ఇచ్చి యధావిధిగా తెలుగు సబ్జెక్టు పరీక్షను రాయించారు. ఈ విషయాన్ని అటు పరీక్ష నిర్వాహకులు, ఇటు కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. పరీక్ష అనంతరం చీఫ్ డిపార్టుమెంట్ అధికారి ఓబుల్‌రెడ్డి కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ సాయిదివ్యతో సంజాయిషీ లెటర్‌తో పాటు విద్యార్థిని నుంచి ఓ లెటర్‌ను తీసుకున్నారు.

రీ సర్వేతో.. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

● వందేళ్ల తర్వాత డిజిటల్ నమోదు ● భూ రికార్డుల సమగ్ర ప్రక్షాళన కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

భూరికార్డులు సమగ్రంగా లేకపోవడం వివాదాలకు, ఘర్షణలకు కారణమవుతోంది. తప్పుడు రికార్డుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భూమి రికార్డులను ప్రక్షాళన చేసేందుకు రీ సర్వేకు ఆదేశించింది. వందేళ్ల తర్వాత చేస్తున్న ఈ సర్వేతో భూవివాదాలు పరిష్కారం అవుతాయని ఆశిస్తోంది.


సమగ్ర భూ సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 1923-24 లో దేశంలో భూరికార్డులను ఆధునికీకరించా రు. భూములు కొలిచి ఫీల్డ్ మెజర్మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ)లో నమోదు చేశారు. అప్పట్లో నాటిన సర్వే రాళ్ల కేంద్రంగానే నేటికీ భూము లను కొలుస్తూ ఉంటారు. యజమానులు మా రినా ఆయా భూముల పంపకాల ఆధారంగా భాగాలను చేసి సర్వే నెంబర్లు మాత్రం అవే కొనసాగిస్తున్నారు. వందేళ్ల నాటి ఎఫ్ఎంబీ ఆధారంగా ప్రస్తుతం భూముల సర్వే చాలా ఆలస్యం అవుతోంది. భూరికార్డులు సరిగా లేకపోవడం వివాదాలకు కారణమవుతోందని కేంద్ర ప్రభుత్వం గుర్తించి రీసర్వేకు ఆదేశించి నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ప్రతి కమతాన్ని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా మార్కింగ్ చేసి, నెంబర్ కేటాయించడంతో పాటు క్యూఆర్ కోడ్ నమో దు చేస్తుండడంతో భూవివాదాలు పరిష్కారం అవుతాయని చెబుతున్నారు. వైసీపీ హయాం లో 2022-23 సంవత్సరంలో రాష్ట్రంలో 4,500 సర్వే బృందాలతో రూ.1000 కోట్లు ఖర్చు చేసి, 3.31 కోట్ల ఎకరాలు రీ సర్వే చేసినట్లు సమాచారం. దీనికోసం డ్రోన్స్, ఓఆర్‌పీ పరికరాలు, రోవర్లు, హెలికాప్టర్లు వినియోగించారు. సర్వే బృందానికి తగిన గడువు ఇవ్వకపోవడంతో పలు తప్పిదాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం రెవెన్యూ గ్రామసభల్లో గ్రామాల్లో వచ్చిన అర్జీలే ఇందుకు నిదర్శనం.

గ్రామసభల్లో సగం అర్జీలు అవే

ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సుల్లో 1013 అర్జీలు రాగా అందులో 600కు పైగా భూసర్వే కారణంగా ఏర్పడిన సమస్యలే ఉన్నాయి. ఒకే సర్వే నెంబరులో నలుగురు రైతులు ఉన్నా ఒక ఎల్పీఎం నెంబర్ మాత్రమే ఇవ్వడం, రీసర్వే తర్వాత భూవిస్తీర్ణంలో వ్యత్యాసాలు రావడం, ఫొటోలు మారిపోవడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రీసర్వే ప్రారంభమైంది.

అధికారుల పర్యవేక్షణ

గత ప్రభుత్వంలో సర్వేలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూసేందుకు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఇటీవల సంబేపల్లె, కలకడ మండలాల్లో రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. సుండుపల్లె మండలంలో రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి పరిశీలించారు. సర్వే సిబ్బందికి అవసరమైనంత సమయం ఇవ్వడంతో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమమైంది.

భూ వివాదాలు పరిష్కారం..

భూ సమగ్ర సర్వేతో దశాబ్దాలుగా ఉన్న భూవివాదాలు పరిష్కారం అవుతాయి. గతంలో తక్కువ సమయం కారణంగా ఒత్తిడి పెరిగి తప్పిదాలు జరిగిన మాట వాస్తవమే. ప్రస్తుతం తగినంత సమయం ఇవ్వడంతో ప్రతి ఎకరం సర్వే చేసి, వివాదాలకు పరిష్కార మార్గం చూపేందుకు ఆస్కారం ఉంది.

-హరికృష్ణ, మండల సర్వేయర్, సంబేపల్లె

ఒకే ఎల్‌పీఎం నెంబర్ ఇవ్వడమే సమస్య

ఒక సర్వే నెంబర్‌లో నలుగురు రైతులం ఉన్నాం. రీసర్వేలో ఒకే ఎల్‌పీఎం నలుగురికి ఇవ్వడం సమస్యగా మారింది. ప్రస్తుతం వన్‌బీ రావడం లేదు. రీసర్వేతో గ్రామాల్లో మ్యుటేషన్ నిలిపివేయడం రైతులకు సమస్యగా మారింది. గ్రామ సభల్లో అర్జీలు ఇచ్చాం. త్వరగా సమస్య పరిష్కరించాలి.

- వెంకటేశ్వర్లు, రైతు, నారాయణరెడ్డిగారిపల్లె,


రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

రాష్ట్రానికి రాహు, కేతువులు వైసీపీ, టీడీపీ కూటమి

● రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి


తులసిరెడ్డిని సన్మానిస్తున్న రాయచోటి కాంగ్రెస్ పార్టీ నేతలు

రాయచోటిటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ కూటమి దొందూ దొందేనని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ కూటమి రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయని, జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే చంద్రబాబు కైలాసం చూపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మద్య, జూద, డ్రగ్స్, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్టుషాపులు అన్నట్లు అయ్యిందన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్, గంజాయి సంస్కృతి ప్రవేశించిందన్నారు. కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లు గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువగా అప్పులు చేస్తోందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై రూ.15,485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ పార్టీతోనే స్వర్ణాంధ్ర సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, మదనపల్లి సీనియర్ కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, రేణిగుంట సీనియర్ సీనియర్ నేత చిరంజీవి, రాయచోటి సీనియర్ కాంగ్రెస్ నేత ఎస్‌యండీ గౌస్, మైనార్టీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సయ్యద్ అలీ, రాయచోటి పట్టణ అధ్యక్షులు దాదా సర్దార్, వీరబల్లి మండలశాఖ అధ్యక్షులు జనార్ధన్, చెన్నకృష్ణ, ఖదీర్, రెడ్డెయ్యరాజు, ఇర్ఫాన్, మహమ్మద్ అలీ, సాధిక్, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కోర్టులోగంగమ్మకు క్షీరాభిషేకం

మదనపల్లె అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డు కోర్టులో ఆవరణలో ఉన్న గంగమ్మ ఆలయంలో ఈ నెల 19వ తేదీన 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం క్షీరాభిషేకం, సాయంత్రం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, అలంకరణలు ఉంటాయని తెలిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

భర్త నుంచి రక్షణ కల్పించండి

● ఎస్పీకి మదనపల్లె మహిళ మొర


ఎస్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

రాయచోటి టౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): పరాయి స్త్రీ మోజులోపడి కట్టుకున్న భర్త కాలయముడుగా మారాడని మదనపల్లె పట్టణానికి చెందిన భాస్కర్ భార్య పార్వతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు మొరపెట్టుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం బయట ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. తనకు భాస్కర్‌తో పెళ్లి అయి 25 ఏళ్లైందని, వివాహ సమయంలో తమ తల్లిదండ్రులు రూ.5 లక్షలు నగదుతో పాటు 350 గ్రాముల బంగారు నగలు, 150 గ్రాములు వెండి వస్తువులు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం తన భర్త భాస్కర్ పరాయి స్త్రీ మోజులో పడి అదనపు కట్నం తీసుకురావాలని ప్రతిరోజు తనను కొడుతూ, తిడుతూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను అంత డబ్బు అడగలేక, భర్త పెట్టే బాధలు భరించలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నానని వాపోయారు. తన అత్తమామలు, భర్త భాస్కర్, అతని ప్రియురాలు అర్చనతో పాటు, మరిది గోపి అతని భార్య, తనను చం పడానికి ప్రయత్నాలు చేయడంతో తాను తప్పించుకొని పుట్టింటికి చేరానని, అక్కడికి కూడా తన కిరాయి మనుషులను పంపించి చంపడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలంటూ ఆమె ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, తనతల్లిదండ్రులు రామప్ప, లక్ష్మమ్మ తదితరులతో కలిసి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి


రాజశేఖర్ మృతదేహం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు మండలంలోని బి. ఎర్రగుడి పంచాయతీ చంచర్లపల్లెకు చెందిన వండాడి రాజశేఖర్ (28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం మామిడి చెట్లకు ట్యాంకర్ ద్వారా నీరందించేందుకు వెళుతుండగా, దారిలోని మలుపులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రెండేళ్ల క్రితం అతని భార్య మృతి చెందడంతో రెండో వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె నిండు గర్భిణి అని వారు వివరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

ముగ్గురి బైండోవర్


బైండోవర్ చేసిన వ్యక్తులతో ఎస్ఐ వరుణ్‌కుమార్

ఓబులవారిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వై.కోటకు చెందిన ముగ్గురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వరుణ్‌కుమార్ తెలిపారు. వై.కోట గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య, చలపతి, పెంచలయ్య గతంలో నాటుసారా తయారీ కేసుల్లో నిందితులుగా ఉన్నారని, వీరిని ఓబులవారిపల్లె తహసీల్దారు శ్రీధర్‌రావు ఎదుట హాజరుపరిచి బైండోవర్‌కు సంబంధించి నిబంధనలు తెలియజేసి విడిచిపెట్టినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ వరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక యువతి అనుమానాస్పద మృతి

● రాత్రికిరాత్రే మృతదేహం తరలింపు

● ఆలస్యంగా వెలుగులోకి.. ● హత్యా... ఆత్మహత్యా?

గుర్రంకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడుకు చెందిన ఓ మిల్‌లో కర్ణాటక రాష్ట్రం బెల్గాంకు చెందిన కుమార్, సంగీత(21) దంపతులు ఏడాదిన్నరగా కూలి పనులు చేస్తున్నారు. ఈ మధ్య వారు తరచూ గొడవపడుతున్నట్లు సమాచారం. గత నెలలో శివరాత్రి నాడు భర్త ఇట్లో లేని సమయంలో సంగీత ఉరి వేసుకొని మృతి చెందింది. విషయాన్ని కుమార్ తన తోటి కూలీలు, యజమానికి చెప్పడంతో రాత్రికిరాత్రే ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో మృతదేహాన్ని బెల్గాంకు తరలించారు. ఈ విషయం ఆలస్యంగా బయటకు రావడం పలు అనుమానాలు రేకెత్తించింది. కాగా యువతి మృతికి గల కారణాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అలాగే అనుమానం ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా, సంగీతది ఆత్మహత్యా, హత్యా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ప్రభుత్వం మారినా..పుంగనూరు రాజ్యాంగం మారలేదు

● అరాచక శక్తుల మెడలు వంచుతాం ● చమర్తి జగన్‌మోహన్‌రాజు


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా..పుంగనూరులో పెద్ది రెడ్డి రాజ్యాంగం మారలేదని, అలాంటి అరాచక శక్తుల మెడలు వంచుతామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం లోని పుంగనూరు నియోజకవర్గం కృష్ణాపురంలో సోమవారం టీడీపీ కార్యకర్త కాగితి రామకృష్ణ కుటుంబీకులను పలువురు టీడీపీ నాయ కులు పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడు తూ పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఖాదీ కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి, పుంగనూరు అబ్జర్వర్ భాస్కర్ యాదవ్‌లతో కలపి రామకృష్ణ కుటుంబీకులకు ధైర్యం చెప్పామన్నారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తున్న వారిని ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. అలాంటి వారికి చట్ట ప్రకారం శిక్ష పడటం ఖాయమన్నారు. వైసీపీ నాయకుల బరితెగింపు చర్యలు అంతమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావర ణం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. గూండాలు, అరాచక శక్తులను ప్రభుత్వం అణచివేస్తుందన్నారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం లక్ష రూపాయలను నగదును రామకృష్ణ కుమారులు శివ, శ్రీనివాసులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు మోడెం సిద్దప్ప, నీలకంఠ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేశ్, నాదెళ్ల అరుణ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు తిరునాళ్లకు 27 ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో ఈ నెల 19న ప్రారంభమయ్యే జాతర సందర్భంగా మదనపల్లె వన్ డిపో నుంచి ముదివేడుకు 27 బస్సులను నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రైవేటు వాహనాల్లో వెళ్లి ఇబ్బందులు పడకుండా, అధిక చార్జీలతో ఆర్థికంగా నష్టపోకుండా స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామని తెలిపారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ సర్వీసు లను సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ సిబ్బంది అందు బాటులో ఉంటూ అసౌకర్యం కలగకుం డా బాధ్యతగా వ్యవహరిస్తారని వివరించారు.

రాయచోటి సబ్‌జైలు పరిశీలన



రాయచోటి సబ్‌జైల్లో రికార్డులను పరిశీలిస్తున్న కడప కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

రాయచోటి టౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచనల మేరకు సెక్రటరీ- కం- సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ సోమవారం రాయచోటి సబ్‌జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. లీగర్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరిండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

ముద్దు గుమ్మలు కాదు.. దిష్టి బొమ్మలు..!




రైల్వేకోడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పొ లాలకు దృష్టిదోషం తగులకుండా నల్లకుండలకు దిష్టి చుక్కలు పెట్టేవారు. తర్వాత గడ్డితో తయారు చేసిన బొమ్మలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం సినీ తారల అర్ధనగ్న చిత్రాలను పొలాల మధ్యలో పెడుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడి, బొప్పాయి, అరటి, దోస, కర్బూజా తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఎక్కువగా దిగుబడులు వచ్చినపుడు దృష్టిదోషం తగులకుండా దిష్టిబొమ్మలను ఏర్పాటు చేసేవారు. కాలాను గుణంగా రైతులూ మారిపోయారు. బికినీలతో ఉన్న సినీతారల చిత్రాలను దిష్టి బొమ్మ లుగా ఏర్పాటు చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో రోడ్డు పొడవునా ఉన్న పొలాల్లో ఇలాంటి దృశ్యాలు ఆ మార్గంలో వెళుతున్న వారిని ఆకట్టుకుంటున్నాయి.

50 వసంతాల బడి..!


ములకలచెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాల

- ములకలచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటై 50 ఏళ్లు పూర్తి
- ఇక్కడ చదువుకున్న విద్యార్థుల్లో ఎందరో ప్రముఖులు
- స్వర్ణోత్సవాలకు సన్నాహాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల. ఇక్కడ చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారు ఎందరో ఉన్నారు. ఎందరికో అక్షరాలు నేర్పిన ములకలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకుంది. ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరిపితే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ములకలచెరువులోని పీటీఎం రోడ్డులో 1974-75 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. పాఠశాల ప్రాంగణం ఎంతో విశాలంగా ఉంటుంది. ఆటస్థలం, పచ్చని చెట్ల మధ్య పాఠశాల ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. 50 ఏళ్ళుగా 10వేల మంది ఇక్కడ చదువుకున్నారు. ఈ పాఠశాలలో చదివిన శ్రీనివాసులునాయక్ ప్రస్తుతం శ్రీ కాళహస్తిలో జిల్లా కోర్టు జడ్జిగా ఉన్నారు. అలాగే శివశంకర్‌రెడ్డి బెంగళూరులో డీఎస్పీగా పని చేస్తున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఇక్కడే చదివారు. అలాగే ఇక్కడ చదువుకున్న గోట రామచంద్ర, అమరనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నౌషాద్, సుధాకర్‌రెడ్డి, ఆనందరెడ్డి,ఖాదర్‌బాషా, మహమ్మద్‌రఫీ తదితరులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. ఇలా ఎంతో మంది ఇక్కడే చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు.

ఇక్కడే చదివి... ఇక్కడే విధులు

ములకలచెరువుకు చెందిన పూల కృష్ణారెడ్డి ప్రస్తుతం పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయ న 1976 నుంచి 1981 వరకు ఇక్కడే చదువున్నారు. ఆయన చ దువుకునే సయమంలో స్కూల్ ఫస్ట్‌గా నిలిచాడు. ప్రస్తుతం తాను చదువున్న పాఠశాలలోనే ఆయన హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్నారు.

త్వరలో పూర్వ విద్యార్థులతో సమావేశం

పదవ తరగతి పరీక్షల అనంతరం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించేందుకు హెడ్మాస్టర్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో వేడుకల నిర్వహణపై చర్చించనున్నారు.

పాఠశాల ఏర్పాటై 50 వసంతాలు పూర్తి..



ములకలచెరువు జడ్పీ హైస్కూల్ 1974-75 లో ఏర్పడింది. గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. పూర్వ విద్యార్థులు ముందుకొస్తే బాగుంటుంది. నేను ఇదే పాఠశాలలో చదువుకున్నాను. ఇక్కడే చదువుకుని హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న సమయంలో పాఠశాలకు 50 ఏళ్ల పూర్తి కావడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

- కృష్ణారెడ్డి, హెడ్మాస్టర్, జడ్పీ హైస్కూల్

ఎంతో సంతోషంగా ఉంది




ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదువుకుని పారిశ్రామిక వేతగా ఎదిగాను. పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు సహాయ, సహకారాలు అందిస్తాను. పాఠశాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాను. ప్రభుత్వ సహకారంలో పాఠశాలలో అన్ని వసతుల కల్పనకు కృషి చేస్తాను.

- దాసరిపల్లి జయచంద్రారెడ్డి, పూర్వ విద్యార్థి

మత్తు కోసం...

- గాడి తప్పుతున్న మైనర్లు, యువత
- మాత్రలు, సొల్యూషన్, గంజాయి వినియోగం
- ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే విక్రయాలు
- రూ.20 విలువ చేసే మాత్ర రూ.500కు
- కొరవడుతున్న తల్లిదండ్రుల నిఘా



యువత మత్తు వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. తెలిసీ తెలియని వయసులో ఫ్యాషన్ పేరుతో సరదాగా సిగరెట్లు, మద్యం తో మొదలైన అలవాటు క్రమంగా గంజాయి, సొల్యూషన్, వైట్‌నర్ వంటి వాటిని పీలుస్తూ మత్తులో ఊగి పోతున్నారు. ఎక్కువగా 12 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్కులే ఇలాంటి మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతుండడం గమనార్హం. దీనిపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ప్రస్తావించడం గమనార్హం.

కడప (క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా మంది యువత మత్తు కోసం మద్యం, గంజాయితో పాటు ప్రమాదకరమైన మత్త పదార్థాలను వినియోగిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో యువకులు వీటికి అలవాటు పడుతున్నారు. చిన్నచౌకు, తిలక్‌నగర్, మాచుపల్లి రోడ్డులోని ఉక్కాయపల్లి డంప్‌యార్డు, బాలాజీనగర్, అల్మాస్ పేట, సాయిపేట, నకాష్, రవీంద్రనగర్, ఖలీల్ నగర్‌తో పాటు బుగ్గవంక కాలువ సైడ్‌వాల్ వంటి ప్రాంతాల్లో యువకులు మద్యం, గంజాయి లాంటి అలవాట్లే కాకుండా ఇప్పుడు ఎక్కువగా మత్తు ఎక్కించే ట్యాబ్లెట్లను వినియోగిస్తుండడం గమనార్హం. వీటిని కొన్ని మెడికల్ స్టోర్లలోనే కాకుండా సెల్‌పాయింట్లలో రూ.20విలువ చేసే మాత్రలు రూ.500లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విక్రయాలు

గంజాయికి అలవాడుపడిన యువకులు చిన్న చిన్న బ్యాచ్‌లను ఏర్పాటు చేసుకొని గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఒకప్పుడు గంజాయి చిన్న ప్యాకెట్ రూ.50 నుంచి వంద రూపాయాలు విక్రయించే వారు. ఇప్పుడు రూ.వెయ్యికి పైనే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి విక్రయించే వారు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని.. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా యథేచ్ఛగా విక్రయాలను సాగిస్తున్నారు. గంజాయి, ట్యాబ్లె ట్స్ అవసరం ఉన్న వారికి ఇన్‌స్టాగ్రామ్ ఐడీని ఇస్తారు. ఎవరికీ అనుమానం రాకుండా ఎవరూ లేని చోటికి పిలిపించుకొని వారికి విక్రయిస్తారు. ఫోన్‌పే లేకుండా క్యాష్ ఉంటేనే ఇస్తా రు. దీంతో పోలీసులు వీరిని గుర్తించడం కష్టతరంగా మారుతోంది.



డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి యువకులకు కోటింగ్ ఇస్తున్న పోలీసులు

డ్రోన్ కెమెరాలతో పోలీసు నిఘా

గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. కడప నగరం శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు.

డాక్టరు ప్రిస్కిప్షన్లు లేకుండానే..

ప్రమాదకరమైన మత్తు ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు యువకులు తీసుకుంటున్నారు. వైద్యుల అనుమతి లేకుండానే ట్యాప్ ప్రీ ఈఆర్ 50, రెస్టల్ 0.5/0.25 ఎంజీ, క్లోనోట్రిల్ 0.5 లాంటి మాత్రలు వినియోగిస్తున్నారు. వీరిలో ఎక్కువగా మైనర్‌లే ఉన్నారు. ఇలాంటి వారు ఎక్కువ రోజులు జీవించలేక మధ్యలో ఆయూస్సు తీసుకుంటున్నారు. అటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇటు అధికారులు యువతపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా, ఇటీవల ఒన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నిఘా ఉంచి కొందరి యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా.. కర్నూలు జిల్లా నుంచి మత్తు ట్యాబ్‌లెట్స్ వస్తున్నట్లు గుర్తించారు. అలాగే మందుల షాపుల నిర్వాహకులకు ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణ కెమిస్ట్ అండ్ డ్రగ్స్ అధికారులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. అనుమతులు లేకుండా మత్తు మాత్రలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొరవడుతున్న తల్లిదండ్రులు నిఘా...

తమబిడ్డల పట్ల తల్లిదండ్రులు నిఘా లేకపోవడంతో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. పిల్లలు రాత్రిళ్లు ఎక్కడెక్కడ తిరుగుతున్నారు. ఎవరితో తిరుగుతున్నారో సరిగా పట్టించుకోకపోవడంతోనే పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఈ మత్తుకు బానిసలుగా మారిన యువకులు ఏం చేస్తున్నారో వారికే అర్థం కాకు గొడవలకు పాల్పడుతున్నారు. మరికొందరు నిషా మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఎస్పీ

కడప క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. సంబంధిత అధికారులకు ఫోను ద్వారా వారి సమస్యలను తెలిపి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు సమస్యను ప్రశాంతంగా వివరించడానికి సిబ్బంది సహాయం చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

అత్యాధునిక పిచ్ రోలర్ ప్రారంభం



పిచ్ రోలర్‌ను డ్రైవ్ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప నగరంలోని పోలీసు క్రికెట్ స్టేడియంలో అత్యాధునిక పిచ్ రోలర్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న పిచ్‌ను క్రికెట్ టోర్నమెంట్లకు అనుకూలంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా రోలర్‌ను తెప్పించారు. రోలర్‌కు జిల్లా ఎస్పీ పూజ నిర్వహించి స్వయంగా డ్రైవ్ చేసి పరిశీలించారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది క్రీడల ద్వారా నూతనోత్తేజం పొందవచ్చని, స్టేడియంను సద్వినియోగం చేసకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ ఇతరులు కూడా స్టేడియాన్ని అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవచ్చని, వివరాలకు 9121100641 లేదా 9000144343 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేలం ద్వారా 'గండి'కి రూ.1.75 లక్షల ఆదాయం

చక్రాయపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. కౌలుదారులకు, షాపింగ్ కాంప్లెక్స్, సులభ్‌కాంప్లెక్స్, పాలు, పెరుగు సరఫరా, నిత్యన్నదాన పథకానికి కావాల్సిన కూరగాయలకు వేలం పాట నిర్వహించారు. ఇడుపులపాయలో 469 సర్వేనెంబర్‌లో 8.72 ఎకరాల భూమి మూడు సంవత్సరాలు కౌలు చేసుకోవచ్చు, అందులో ఏడాదికి ఇడుపులపాయకు చెందిన మహేష్ రూ.1.51 లక్షలు అత్యధికంగా పాడి పాట దక్కించుకున్నారు. మూడేళ్ల క్రితం ఈ భూమి కౌలు ఏడాదికి రూ.30వేలు పాడారు. వీరన్నగట్టుపల్లె సమీపంలో 0.98 ఎకరాల భూమిని ఆర్.తేజేశ్వర్ రూ.4వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. సులభ్ కాంప్లెక్స్‌కు ఇడుపులపాయకు చెందిన వెంకటరత్నం ఏడాదికి రూ.20 వేలకు దక్కించుకున్నారు. కూరగాయలకు, పాలు, పెరుగుకు టెండర్‌లో సరైన ధర లేకపోవడంతో నిలుపుదల చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వా మి, దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్, కడప దేవాదాయశాఖ తనిఖీదారు శివయ్య, ఆర్కే వ్యాలీ పోలీసులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ, ఎంఈడీ పరీక్షలు ప్రారంభం



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని కేంద్రాల్లో బీఈడీ, ఎంఈడీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఈడీ పరీక్షలకు 4463 మంది విద్యార్థులు, ఎంఈడీ పరీక్షలకు 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, విజయలక్ష్మి బీఈడీ కళాశాల పరీక్ష కేంద్రాలను విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు, అబ్జర్వర్లు ఆచార్య మాధవి, ఆచార్య రియాజ్ ఉన్నీసా అకస్మికంగా తనిఖీ చేశారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచనలిచ్చారు.

ప్రారంభమైన లా పరీక్షలు

యోగివేమన విశ్వవిద్యాలయం పరధిలోని మూడు, ఐదేళ్ల లా కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు సోమవారం యోగవేమన విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. మూడేళ్ల ఎల్ఎల్‌బీ 3,5 సెమిస్టర్లు, ఐదేళ్లకు సంబంధించి 3,5,7,9 సెమిస్టర్లు చదువుతున్న విదార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 75 మంది విద్యార్థులు హాజరు కాగా మధ్యాహ్నం 173 మంది రాశారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షల ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమారి పర్యవేక్షించారు.

పదోన్నతుల్లో మాకు అన్యాయం

- ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఏఎన్ఎంల ఫిర్యాదు

చిత్తూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-3 ఏఎన్ఎంల పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందని మదనపల్లెలో పనిచేస్తున్న కొందరు ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి, డీఎంహెచ్‌వో సుధారాణిని కలిసి ఫిర్యాదు చేశారు. తామంతా మదనపల్లె మున్సిపాలిటీలో వార్డు సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీలుగా పనిచేస్తున్నామని చెప్పారు. గతనెల 21వ తేదీన ప్రమోషన్ లిస్ట్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిందన్నారు. అందులో తాము ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నామన్నారు. తర్వాత విడుదలైన ప్రమోషన్ ప్రపోజల్ కేటగిరీ లిస్టులో తమ పేర్లు లేవని తెలిపారు. అందులో తమకన్నా కింద ఉన్నవారి పేర్లు ఉన్నాయని చెప్పారు. విచారించి, న్యాయం చేయాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులను చూపుతున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి ఒకటిన్నర్ర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వుల మేరకు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్‌లు సిబ్బందితో కలసి మున్సి పాలిటీ పరిధిలోని చెన్నంపల్లె ఎస్టీకాలనీ కాశినాయన గుడిదగ్గర అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న రాజుగారివీధికి చెందిన పండు మనోజ్‌కుమార్, వల్లెలవారిపల్లెకు చెందిన రాజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఒకటిన్నర్ర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా చేసినా, అమ్మకాలు చేపట్టినా, వారికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బుగ్గవంక కాల్వలో వ్యక్తి మృతి

కడప క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తారక రామానగర్ సమీ పంలోని బుగ్గవంక కాల్వలో పఠాన్ మాదర్‌ఖాన్ (60) అనే వ్యక్తి మృతి చెంది నట్లు తాలుకా ఎస్ఐ తాహిర్ హుసేన్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. రాజుకాలనీకి చెందిన మాదర్‌ఖాన్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి... కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు విద్యుత్ శాఖ ఇంజినీర్లపై విచారణ

- మరో లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మ్యాన్‌లపై కూడా..
- ప్రెజెంటింగ్ అధికారిగా కడప ఏసీబీ సీఐ నాగరాజు నియామకం

కలికిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడి పక్కా ఆధారాలతో ఏసీబీకి చిక్కిన మైదుకూరు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఇంజినీర్లు, ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, మరో లైన్‌మ్యాన్‌లపై ఏపీ ఎస్పీడీసీఎల్ విచారణకు నిర్ణయించింది. మైదుకూరు విద్యుత్‌శాఖ ఏఈఈ కార్యాలయంలో 2022 మార్చి 30న ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పలువురు ఇంజినీర్లు, ఉద్యోగుల అవినీతికి సంబంధించి ఫిర్యాదులు అందడంతో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. ఫలితంగా మైదుకూరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎ.రామభద్రయ్య, మరో ఏఈఈ చౌడమ్ హరికృష్ణ, జూనియర్ ఇంజినీరు జి.రాజకుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ సింగారపు జయరాజు, లైన్‌మ్యాన్ ఎస్.నాగరాజ రెడ్డిలు అవినీతికి పాల్పడినట్లు ఏసీబీ తనిఖీల్లో వెల్లడయ్యింది. దీనిపై పలు అభియోగాలతో కేసు నమోదు చేసి తరువాత చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించింది. ఏసీబీ నమోదు చేసిన అభియోగాలకు సంబంధించి పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం శాఖపరంగా తగిన విచారణ చేపట్టాలని ఎస్పీడీసీఎల్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణకు తగిన ఆధారాలను, వివరాలను ఏసీబీ తరఫున విచారణ అధికారి ముందుంచేందుకు ప్రెజెంటింగ్ అధికారిగా కడప ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి.నాగరాజును నియమించాలని ఏసీబీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తూ విచారణాధికారులకు సహకరించేందుకు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ నాగరాజును నియమిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

నాలుగేళ్లయినా పూర్తి కాని భవన నిర్మాణాలు

- పొలాల మధ్య భయాందోళనలో ఉంటున్న విద్యార్థినులు
- మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

పులివెందులటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండల కేంద్రంలో బాలికల బీసీ వసతిగృహం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండలిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కిందట బాలికల బీసీ వసతిగృహం మంజూరైనా.. ఇప్పటికీ నిర్మాణ పనులు పూర్తి కాలేదన్నారు. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టరు కూడా పనులు ఆపివేసి వెళ్లిపోయారన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా పులివెందుల పట్టణ శివార్లలో పొలం వద్ద భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారని.. అక్కడ సరైన రక్షణ లేక పాములు వస్తుండడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో మంత్రి సందర్శించారని.. అక్కడ బాలికలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారన్నారు. త్వరితగతిన పూర్తి చేసి వచ్చే అకడమిక్ ఇయర్ కన్నా విద్యార్థినులకు నూతన భవనాలు అందుబాటులోకి వచ్చేలా చేయాలని కోరారు. ఇందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు.

జ్యోతిక్షేత్రంలో కూల్చివేసిన నిర్మాణాలను వెంటనే పునర్‌నిర్మించాలి



నిరసన కార్యక్రమంలో కాశినాయన భక్తిపాటలు ఆలపిస్తున్న భక్తులు

కడప మారుతీనగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టైగర్ జోన్‌కు దగ్గరగా ఉందనే నెపంతో లక్షలాది మంది మనోభావాలు దెబ్బతినేలా ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాశిరెడ్డినాయన జ్యోతి క్షేత్రంలో గత కొన్ని సంవత్సరాలుగా గల ఆశ్రమ వసతి గృహాలను అటవీశాఖ అధికాలు కూల్చివేయడం బాధాకరమని హిందూస్ ఫర్ ప్లూరలిటీ ఈక్వాలిటీ అన్నమయ్య కళాక్షేత్రం జైభారత్ ప్రతినిధులు పేర్కొన్నారు. తక్షణమే కూల్చివేసిన నిర్మాణాలను పునఃనిర్మించాలని డిమాండ్ చేశారు. హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ, అన్నమయ్య కళాక్షేత్రం, జైభారత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి కాశినాయన భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి, జైభారత్ జాతీయ ఉపాధ్యక్షుడు వంశీ, రాష్ట్ర అధ్యక్షుడు అరవింద్, నాయకులు గొల్లపల్లి గురవయ్య, కె.నాగభూషణం, రామయ్య మాట్లాడారు. కులమతాలకు అతీతంగా నిత్యం వేలాది మంది భక్తులచే పూజలందుకుంటున్న కాశిరెడ్డి నాయన క్షేత్రం నల్లమల్ల అటవీ ప్రాంత టైగర్ జోన్‌కు దగ్గరలో ఉందనే సాకుతో కేంద్రప్రభుత్వం అక్కడి నిర్మాణాలను కూల్చివేయడం సరైంది కాదన్నారు. దాతలు భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఆశ్రమ కట్టడాలైన గోశాల, పూలతోట, తొలగించడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు త్వరితగతిన స్పందించి అటవీశాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకునేలా చేయాలన్నారు. భక్తుల మనోభావాలు గౌరవించి కట్టడాలను పునర్‌నిర్మించాలని కోరారు.

న్యాయం జరగలేదంటూ...

కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం - అడ్డుకున్న పోలీసులు

కడప కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలలైనా న్యాయం జరగలేదంటూ సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిలో జాయింట్ కలెక్టర్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకుని పెట్రోల్ బాటిల్ లాక్కొని బయటకు తీసుకెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చాపాడు మండలం నక్కలదిన్నెకు చెందిన బాధితుడు విశ్వనాథరెడ్డి బమట మీడియాతో మాట్లాడుతూ గతేడాది అక్టోబరులో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో తన భార్య శెట్టిపల్లి శివలక్ష్మికి ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగిందన్నారు. అయితే ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియా రాణి నిర్లక్ష్యంగా కారణంగా తన భార్య పేగుకు రంధ్రం పడటంతో ప్రాణాల మీదకు వచ్చిందన్నారు. సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయించి ప్రాణాలు కాపాడుకున్నామన్నారు. తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదంటూ మూడు నెలలుగా ఐఎంఏకు, కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు, డీఎం అండ్ హెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదన్నారు. తన భార్యకు ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియా రాణిపై చర్యలు తీసుకోవాలంటూ డీఎం అండ్ హెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తే అవగాహన రాహిత్యం వల్ల, ఆపరేషన్ సమయంలో పేగుకు రంధ్రం పడిందని తప్పు జరిగుండొచ్చని డాక్టర్ ఇలియా రాణిని కాపాడే విధంగా రిపోర్టు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ ఇలియారాణి భర్త డాక్టర్ రవికుమార్ కూడా స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తూ తప్పుడు రిపోర్టులతో ప్రజలను మోసం చేస్తున్నారని, వీరందరిపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు.



కడప కలెక్టరేట్ సభాభవన్‌లో మీద పెట్రోల్ పోసుకున్న విశ్వనాథరెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు





మీద పెట్రోల్ పోసుకున్న విశ్వనాథరెడ్డిని ఆసుపత్రికి తీసుకెళుతున్న పోలీసులు, తమకు జరిగిన అన్యాయం గురించి జేసీ అదితిసింగ్‌కు వివరిస్తున్న బాధితురాలు శివలక్ష్మి

డాక్టర్‌పై చర్యలకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు జేసీ ఫోన్

అనంతరం కలెక్టరేట్ సభాభవన్‌లో బాధితురాలు విశ్వనాథరెడ్డి భార్య శివలక్ష్మి ఫిర్యాదు మేరకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజును పిలిపించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. నాగరాజు వివరణ ఇస్తూ.. బాధితురాలి ఫిర్యాదు మేరకు గతంలో కమిటీ వేశామని, ఆ కమిటీలో గైనకాలజిస్టు, సర్జన్, రేడియాలజిస్టులు విచారణ చేసి రిపోర్టు ఇచ్చారన్నారు. ఆ నివేదికలను వెంటనే చర్యలకై డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు కూడా పంపినట్లు తెలిపారు. ఏదైనా సర్జరీలు జరిగితే 1 శాతం మేర వ్యత్యాసాలు జరగవచ్చన్నారు. ఆ విషయంపై తాను డాక్టర్‌ను వెనకేసుకొస్తున్నట్లు ఆరోపణలు చేయడం సరికాదని జేసీకి వివరణ ఇచ్చారు. అయినప్పటికీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కమిషనరుకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఫోన్ చేసి ట్యూబెక్టమీ చేసిన డాక్టర్ ఇలియారాణిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హాస్టల్ ఏర్పాటు చేయాలి

రాయచోటి(కలెక్టరేట్),మార్చి17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు జిల్లా కేంద్రంలో వసతి గృహం ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.ఆర్టీసీ బస్సుల్లో ఉచిత సౌకర్యం కల్పించాలన్నారు.

'పది' పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ



రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు ఎస్పీ, డీఈవో


రాయచోటిటౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి సోమవారం రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఈవో డాక్టర్ సుబ్రమణ్యంతో కలిసి తనిఖీ చేశారు.

అనంతరం మాసాపేట జిల్లా పరిషత్ హైస్కూల్, లక్కిరెడ్డిపల్లె మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లో, చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో పరీక్ష ముగిసేంతవరకు జిరాక్స్ ప్రింటింగ్ సెంటర్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. పరీక్షలు కొనసాగుతున్నంతసేపు మొబైల్ పెట్రోలింగ్ బృందం నిరంతరం పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పరీక్ష ముగిశాక ప్రశ్నా ప త్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చేయ్యడానికి పటిష్ట ఎస్కార్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అ వాంఛనీయ సంటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా జరగడానికి పోలీసుశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు.

లక్కిరెడ్డిపల్లి: ఏపీ ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అలాగే బాలికల పాఠశాలలను అదనపు ఎస్పీ వెంకటాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద జనం 100 మీటర్ల దూరంలో ఉండాలన్నారు.

వింతలూ విశేషాలు



చూసే కనులుండాలే గాని ప్రకృతిలో ఎన్నో వింతలూ విశేషాలు ఉన్నాయనేందుకు ఇదో మచ్చుతునక.. ఓ గుట్టపై గుండు మీద గుండు.. దొంతి ఆకారాన్ని పోలి ఉండటం ఇక్కడ విశేషం. సంబేపల్లె మండలం నల్లగంగమ్మ తల్లి ఆలయం రోడ్డు మార్గంలోని మండిపోతుల కుంట వద్ద ఈ చిత్రంలోని దృశ్యం కనిపిస్తుంది. అటుగా వెళ్లే వారందరినీ ఆకర్షిస్తూ కనువిందు చేస్తోంది.

- సంబేపల్లె (ఆంధ్రజ్యోతి)

ఇన్‌చార్జ్‌లతో వసతి గృహాలు విలవిల

సిద్దవటం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలుర వసతి గృహాల్లో పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆ స్థానాల్లో ఇన్‌చార్జి పాలన కొనసాగుతోంది. సిద్దవటం, బాకరాపేట, ఉప్పరపల్లె, సరస్వతీపురం, పార్వతీపురం గ్రామాల్లో 8 ప్రభుత్వ బాలుర, బాలికల వసతిగృహాలు ఉండగా ఉప్పరపల్లె బీసీ బాలుర, సరస్వతీపురం బీసీ బాలికల, సిద్దవటం బీసీ బాలుర, బీసీ బాలికలు ఉప్పరపల్లె బీసీ బాలురు వసతి గృహాల్లో వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉండడంతో కడప, బద్వేలు, పార్వతీపురం ప్రభుత్వ హాస్టల్ వార్డెన్లకు గత యేడాది డిసెంబరులో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో సౌకర్యాలు సరిగా అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ విషయమై జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి భరత్‌రెడ్డిని వివరణ కోరగా సిద్దవటం మండలంలో ప్రభుత్వ హాస్టల్లో వార్డెన్ల కొరత ఉన్నది వాస్తవమేనని, జూలైకి కొత్త నియామకాలు జరుగుతాయన్నారు. అంతవరకు ఇన్ చార్జ్‌లతోనే సర్దుకుపోవాలన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

రైల్వేకోడూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి దాసరి జయచంద్ర తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు పం చాయతీలో జనాభా ప్రాతిపదికన పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు రూ. 26 వేలు ఇవ్వాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు పని భారం తగ్గించాలని తెలిపారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వేలాది మంది కార్మికులను తొలగిస్తున్నారని తెలిపారు.

కార్మికులకు యూనిఫాం, సోపులు, నూనె, చెప్పులు, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మి కులు పెంచలమ్మ, రాజేష్, శివయ్య, గంగయ్య, పుల్లయ్య, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం తెల్లవారుజామున కార్మికులతో మాట్లాడుతున్న జయచంద్ర

కనువిందుగా పాలేటమ్మ జాతర

చిన్నమండెం, మార్చి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ దేవళంపేటలో వెలిసిన పాలేటమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండుగగా సాగింది. అమ్మవారికి మొక్కులు ఉన్న వారు 14 చాందినీ బండ్లు కట్టారు. చాందినీ బండ్లను వద్ద రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత ప్రారంభించారు.

చెక్కభజనలు, కోలాటం, వివిధ వేషధారణలు, డప్పు వాయిద్యాలు కనువిందు చేశా యి. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్‌ఐ సుధాకర్‌ల ఆధ్వర్యంలో దాదాపు 200 మంది పోలీసులతో ఎలాంటి సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జాతర జరిపించారు.





చిన్నమండెం: చాందినీ బండిని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత.. సుండుపల్లిలో...

చింతకూటమ్మకు పూజలు

సుండుపల్లె, మార్చి17(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మం డలంలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలో వెలిసిన చింతకూటమ్మ తిరునాళ్ల సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొక్కుబడులు ఉన్న భక్తులు సోమవారం ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి రంగురంగుల విద్యుత్ దీ పాల అలంకరణలతో చాందినీ బండ్లు దర్శనమిచ్చాయి. దీంతో భక్తులు పూజలు చేశారు. మంగళవారం తిరునాళ్ల ముగింపు కార్యక్రమం సందర్భంగా భక్తులకు అమ్మవారి దర్శనం ఇవ్వనున్నట్లు ఈ సం దర్భంగా గ్రామస్థులు తెలిపారు.

ఏపీఎం మురళిపై చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి17(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లి నియోజకవర్గం బి. కొత్తకోట మండలం బడికాయలపల్లి-4వీవో సంఘమిత్ర భారతి పేరును ఆన్‌లైన్‌లో తొలగించిన గత ఏపీఎం మురళిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం సంఘ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ సభ్యులు తీర్మానం చేయకుండా అకారణంగా భారతి పేరును ఆన్‌లైన్‌లో తొలగించడం సమంజసం కాదన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి బత్తల వెంక్రమణ, సంఘమిత్ర భారతి పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటిటౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్టీఆర్ వైద్య సేవ వైద్యమిత్రలు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాలోని వైద్యమిత్రలు రాయచోటి పట్టణంలో గల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, క్యాడర్ పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, క్యాడర్ కల్పించాలని విన్నవించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హనుమంతునాయుడు నామినేషన్

రాజంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది పచ్చా హనుమంతునాయుడు సోమవారం నామినేషన్ వేశారు.ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సురేష్‌కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారి మూరి గోవర్దన్‌రెడ్డిలకు నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కేఎస్ నరసింహారెడ్డి, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, జల్లి నారాయణ, దాసరి శివరాంగౌడ్, కేఎంఎల్ నరసింహ, షేక్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న హనుమంతునాయుడు

ఎస్వీ రమణకు సుగవాసి సన్మానం



ఎస్వీ రమణను సన్మానిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ ఎస్వీ రమణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా ప్రైవేటు డిగ్రీ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు.జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, పార్టీ మండల మాజీ అధ్యక్షులు కొండయ్య, డాక్టర్ తోట రామయ్య, మేకా నరసింహులు, షామీర్‌బాషా, రవికుమార్, అంజిబాబు, వెంకటరాముడు, సుధాకర్, వరదయ్య, శరణ్య, నరసింహులు, అగ్రహారం సుధాకర్, సూరినాయుడు పాల్గొన్నారు.

కువైత్‌లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

పెనగలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కువైత్ దేశంలోని సాల్మియా ప్రాంతంలో సోమవారం జనసేన పార్టీ పెనగలూరు మండల అధ్యక్షుడు ఎర్రంశెట్టి హరిబాబు రాయల్ అధ్యక్షతన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు ఆయన తెలిపారు. మండల జనసేన పార్టీ నాయకులు, ప్రవాస జనసైనికులు సాల్మియాకు చేరుకుని కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. అనంతరం విందు భోజనం ఆరగించినట్లు తెలిపారు.



జనసేనపార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ప్రవాస భారతీయులు

గృహ హక్కు పథకం అదనపు రుణం కోసం దరఖాస్తు చేసుకోండి

సిద్దవటం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గృహ హక్కు పథకం అదనపు రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఫణిరాజకుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గృహహక్కు పథకం ద్వా రా లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. 12 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

నిర్లక్ష్యం తగదు: ఏఐవైఎఫ్

కడపసెవెన్ రోడ్స్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదని సోమవారం కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగాలు స్తాం, ఉపాధి కల్పిస్తాం, ఉద్యోగాలు లేకపోతే నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తామని అమలు చేయలేదన్నారు.

క్షయ వ్యాధి పట్ల అవగాహన అవసరం

● డిప్యూటీ డీఎంహెచ్‌వో శైలజ



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

రాజంపేట టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శైలజా పేర్కొన్నారు. సోమవారం సీవై టీబీ, స్కిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో వ్యక్తికి క్షయవ్యాధి సోకితే కుటుంబ సభ్యులు ఆ వ్యక్తితో పరిచయం ఉన్న ప్రతిఒక్కరు తప్పనిసరిగా సీవై టీబీ స్కిన్ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని ఆమె తెలిపారు. కూచివారిపల్లె, వరదయ్యగారిపల్లె సబ్‌సెంటర్లలో ఆరుగురు క్షయవ్యాధి గ్రస్థులకు, 8 మంది పరిచయం ఉన్నవారికి పరీక్షలు చేశారు. ఒకవేళ ఎవరికైనా స్కిన్ టెస్టు పరీక్షల్లో పాజిటివ్ వస్తే మూడు నెలల పాటు ప్రభుత్వం అందించే మందులను వాడాలన్నారు. ఈ పరీక్ష ద్వారా క్షయవ్యాధి ఇన్ఫెక్షన్ ఉందో లేదో త్వరగా తెలుసుకోవచ్చునన్నారు. క్షయవ్యాధి గ్రస్థులతో సన్నిహితంగా మెలిగేవారు తప్పనిసరిగా పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, ఏఎన్ఎం నూర్జహాన్, కల్పన, ఎంఎల్‌హెచ్‌పీ ఆలీషా, సుప్రియ, ఆశావర్కర్‌లు సురేఖ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు మంజూరు

పెనగలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండలానికి సబ్సిడీపై 55 వ్యవసాయ యంత్ర పరికరాలు మంజూరయ్యాయని వ్యవసాయాధికారి సుబ్రమణ్యం తెలిపారు. రైతు సేవా కేంద్రం పరిధిలోని వ్యవసాయ రైతుల జాబితా ఆధారంగా పరికరాలు అందిస్తామన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు 8, పవర్ స్ప్రేయర్లు 19, ట్రాక్టర్ స్ప్రేయరు ఒకటి, ట్రాక్టర్ పరికరాలు 25, ఒక రొటేటర్ మంజూరయ్యాయన్నారు. ఈనెల 20 లోగా పట్టాదారు పాసుబుక్కు, బ్యాంకు పాస్‌బుక్కు, 1బి, ఆధార్‌కార్డుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తు ఫారం తీసుకుని రైతుసేవా కేంద్రానికి వెళితే ఏ పరికరానికి ఎంత సబ్సిడీ వస్తుందో సిబ్బంది తెలుపుతారన్నారు. ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గృహ నిర్మాణదారులు పనులు మొదలు పెట్టాలి

ఓబులవారిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గతంలో నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులు పనులు మొదలు పెట్టాలని ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. పీఎఎవై, ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ద్వారా అదనపు నిధులు వెచ్చిస్తున్నదని, అందుకు హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల ను నిర్మాణాలను కొనసాగించేలా చూడాలని సూచించారు.

నిబంధనలు పాటించని ఉద్యోగులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంకా సిబ్బంది నిబంధనలు పాటించడం లేదు. సమయానికి హాజరుకాకపోవడంతో చాలా డిపార్టుమెంట్‌లో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అగ్రికల్చర్, హార్టికల్చర్, మత్స్యశాఖ, ఏపీయంఐపీ, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, భూగర్భ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, డీపీవో, బీసీ వెల్ఫేర్ ఆఫీస్ తదితర డిపార్టుమెంట్ వారు సమయపాలన పాటించడం లేదు.

బస్సులు సమ యానికి రానందువల్ల తమ విధులకు ఆలస్యమవుతోందని వారు పేర్కొంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మహిళలకు కనీసం బాత్‌రూంలు కూడా సరిగ్గా లేని పరిస్థితి నెల కింది. భోజనం, టీ, కాఫీ, తాగునీరు కావాలంటే దాదాపు మూడు కిలోమీటర్లు రింగురోడ్డుకు వెళ్లాల్సిందే. కనీసం ఇంటర్నెట్ సౌకర్యం కూడా లేదని, రాయచోటికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కార్యాలయాలకు సిబ్బంది రావడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది. ఈ విషయంపై కొంత మంది హెచ్‌వోడీలను వివరణ కోరగా తాము కార్లు పెట్టుకొని వచ్చేస్తున్నామన్నారు. తమ సిబ్బం ది ఆటోల కోసం వెయిట్ చేయడం వల్ల సమయం ఎక్కువ పడుతోందంటున్నారు.



జిల్లా సహకార మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు



ఆహార భద్రత కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం

రీ సర్వేతో.. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

భూరికార్డులు సమగ్రంగా లేకపోవడం వివాదాలకు, ఘర్షణలకు కారణమవుతోంది. తప్పుడు రికార్డుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భూమి రికార్డులను ప్రక్షాళన చేసేందుకు రీ సర్వేకు ఆదేశించింది. వందేళ్ల తర్వాత చేస్తున్న ఈ సర్వేతో భూవివాదాలు పరిష్కారం అవుతాయని ఆశిస్తోంది.

● వందేళ్ల తర్వాత డిజిటల్ నమోదు ● భూ రికార్డుల సమగ్ర ప్రక్షాళన కేంద్ర ప్రభుత్వ లక్ష్యం


సమగ్ర భూ సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 1923-24 లో దేశంలో భూరికార్డులను ఆధునికీకరించారు. భూములు కొలిచి ఫీల్డ్ మెజర్మెంట్ బుక్ (ఎఫ్‌ఎంబీ)లో నమోదు చేశారు. అప్పట్లో నాటిన సర్వే రాళ్ల కేంద్రంగానే నేటికీ భూములను కొలుస్తూ ఉంటారు. యజమానులు మారినా ఆయా భూముల పంపకాల ఆధారంగా భాగాలను చేసి సర్వే నెంబర్లు మాత్రం అవే కొనసాగిస్తున్నారు. వందేళ్ల నాటి ఎఫ్‌ఎంబీ ఆధారంగా ప్రస్తుతం భూముల సర్వే చాలా ఆలస్యం అవుతోంది. భూరికార్డులు సరిగా లేకపోవడం వివాదాలకు కారణమవుతోందని కేంద్ర ప్రభుత్వం గుర్తించి రీసర్వేకు ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ప్రతి కమతాన్ని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా మార్కింగ్ చేసి, నెంబర్ కేటాయించడంతో పాటు క్యూఆర్ కోడ్ నమోదు చేస్తుండడంతో భూవివాదాలు పరిష్కారం అవుతాయని చెబుతున్నారు. వైసీపీ హయాం లో 2022-23 సంవత్సరంలో రాష్ట్రంలో 4,500 సర్వే బృందాలతో రూ.1000 కోట్లు ఖర్చు చేసి, 3.31 కోట్ల ఎకరాలు రీ సర్వే చేసినట్లు సమాచారం. దీనికోసం డ్రోన్స్, ఓఆర్‌పీ పరికరాలు, రోవర్లు, హెలికాప్టర్లు వినియోగించారు. సర్వే బృందానికి తగిన గడువు ఇవ్వకపోవడంతో పలు తప్పిదాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం రెవెన్యూ గ్రామసభల్లో గ్రామాల్లో వచ్చిన అర్జీలే ఇందుకు నిదర్శనం.

గ్రామసభల్లో సగం అర్జీలు అవే

ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సుల్లో 1013 అర్జీలు రాగా అందులో 600కు పైగా భూసర్వే కారణంగా ఏర్పడిన సమస్యలే ఉన్నాయి. ఒకే సర్వే నెంబరులో నలుగురు రైతులు ఉన్నా ఒక ఎల్పీఎం నెంబర్ మాత్రమే ఇవ్వడం, రీసర్వే తర్వాత భూవిస్తీర్ణంలో వ్యత్యాసాలు రావడం, ఫొటోలు మారిపోవడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రీసర్వే ప్రారంభమైంది.

అధికారుల పర్యవేక్షణ

గత ప్రభుత్వంలో సర్వేలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూసేందుకు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఇటీవల సంబేపల్లె, కలకడ మండలాల్లో రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. సుండుపల్లె మండలంలో రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి పరిశీలించారు. సర్వే సిబ్బందికి అవసరమైనంత సమయం ఇవ్వడంతో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమమైంది.

భూ వివాదాలు పరిష్కారం..

భూ సమగ్ర సర్వేతో దశాబ్దాలుగా ఉన్న భూవివాదాలు పరిష్కారం అవుతాయి. గతంలో తక్కువ సమయం కారణంగా ఒత్తిడి పెరిగి తప్పిదాలు జరిగిన మాట వాస్తవమే. ప్రస్తుతం తగినంత సమయం ఇవ్వడంతో ప్రతి ఎకరం సర్వే చేసి, వివాదాలకు పరిష్కార మార్గం చూపేందుకు ఆస్కారం ఉంది.

-హరికృష్ణ, మండల సర్వేయర్, సంబేపల్లె

ఒకే ఎల్పీఎం నెంబర్ ఇవ్వడమే సమస్య

ఒక సర్వే నెంబర్‌లో నలుగురు రైతులం ఉన్నాం. రీసర్వేలో ఒకే ఎల్పీఎం నలుగురికి ఇవ్వడం సమస్యగా మారింది. ప్రస్తుతం వన్‌బీ రావడం లేదు. రీసర్వేతో గ్రామాల్లో మ్యుటేషన్ నిలిపివేయడం రైతులకు సమస్యగా మారింది. గ్రామసభల్లో అర్జీలు ఇచ్చాం. త్వరగా సమస్య పరిష్కరించాలి.

- వెంకటేశ్వర్లు, రైతు, నారాయణరెడ్డిగారిపల్లె,


రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

రాష్ట్రానికి రాహు, కేతువులు
వైసీపీ, టీడీపీ కూటమి

● రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి


తులసిరెడ్డిని సన్మానిస్తున్న రాయచోటి కాంగ్రెస్ పార్టీ నేతలు

రాయచోటిటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ కూటమి దొందూ దొందేనని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ కూటమి రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయని, జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే చంద్రబాబు కైలాసం చూపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మద్య, జూద, డ్రగ్స్, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్టుషాపులు అన్నట్లు అయ్యిందన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్ గంజాయి సంస్కృతి ప్రవేశించిందన్నారు. కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లు గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువగా అప్పులు చేస్తోందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై రూ.15,485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ పార్టీతోనే స్వర్ణాంధ్ర సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, మదనపల్లి సీనియర్ కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, రేణిగుంట సీనియర్ సీనియర్ నేత చిరంజీవి, రాయచోటి సీనియర్ కాంగ్రెస్ నేత ఎస్‌ఎండీ గౌస్, మైనార్టీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సయ్యద్ అలీ, రాయచోటి పట్టణ అధ్యక్షులు దాదా సర్దార్, వీరబల్లి మండలశాఖ అధ్యక్షులు జనార్దన్, చెన్నకృష్ణ, ఖదీర్, రెడ్డెయ్యరాజు, ఇర్ఫాన్, మహమ్మద్ అలీ, సాదిక్, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కోర్టులోగంగమ్మకు క్షీరాభిషేకం

మదనపల్లె అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డు కోర్టులో ఆవరణలో ఉన్న గంగమ్మ ఆలయంలో ఈ నెల 19వ తేదీన 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం క్షీరాభిషేకం, సాయంత్రం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, అలంకరణలు ఉంటాయని తెలిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

భర్త నుంచి రక్షణ కల్పించండి

● ఎస్పీకి మదనపల్లె మహిళ మొర


ఎస్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

రాయచోటి టౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): పరాయి స్త్రీ మోజులోపడి కట్టుకున్న భర్త కాలయముడుగా మారాడని మదనపల్లె పట్టణానికి చెందిన భాస్కర్ భార్య పార్వతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు మొరపెట్టుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం బయట ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. తనకు భాస్కర్‌తో పెళ్లి అయి 25 ఏళ్లైందని, వివాహ సమయంలో తమ తల్లిదండ్రులు రూ.5 లక్షలు నగదుతో పాటు 350 గ్రాముల బంగారు నగలు, 150 గ్రాములు వెండి వస్తువులు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం తన భర్త భాస్కర్ పరాయి స్త్రీ మోజులో పడి అదనపు కట్నం తీసుకురావాలని ప్రతిరోజు తనను కొడుతూ, తిడుతూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను అంత డబ్బు అడగలేక, భర్త పెట్టే బాధలు భరించలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నానని వాపోయారు. తన అత్తమామలు, భర్త భాస్కర్, అతని ప్రియురాలు అర్చనతో పాటు, మరిది గోపి అతని భార్య, తనను చంపడానికి ప్రయత్నాలు చేయడంతో తాను తప్పించుకొని పుట్టింటికి చేరానని, అక్కడికి కూడా తన కిరాయి మనుషులను పంపించి చంపడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలంటూ ఆమె ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, తనతల్లిదండ్రులు రామప్ప, లక్ష్మమ్మ తదితరులతో కలిసి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వం మారినా..పుంగనూరు రాజ్యాంగం మారలేదు

● అరాచక శక్తుల మెడలు వంచుతాం ● చమర్తి జగన్‌మోహన్‌రాజు


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా..పుంగనూరులో పెద్ది రెడ్డి రాజ్యాంగం మారలేదని, అలాంటి అరాచక శక్తుల మెడలు వంచుతామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం లోని పుంగనూరు నియోజకవర్గం కృష్ణాపురంలో సోమవారం టీడీపీ కార్యకర్త కాగితి రామకృష్ణ కుటుంబీకులను పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాలతో చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఖాదీ కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి, పుంగనూరు అబ్జర్వర్ భాస్కర్ యాదవ్‌లతో కలిపి రామకృష్ణ కుటుంబీకులకు ధైర్యం చెప్పామన్నారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తున్న వారిని ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. అలాంటి వారికి చట్ట ప్రకారం శిక్ష పడటం ఖాయమన్నారు. వైసీపీ నాయకుల బరితెగింపు చర్యలు అంతమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. గూండాలు, అరాచక శక్తులను ప్రభుత్వం అణచివేస్తుందన్నారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం లక్ష రూపాయలను నగదును రామకృష్ణ కుమారులు శివ, శ్రీనివాసులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు మోడెం సిద్దప్ప, నీలకంఠ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేశ్, నాదెళ్ల అరుణ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు తిరునాళ్లకు 27 ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో ఈ నెల 19న ప్రారంభమయ్యే జాతర సందర్భంగా మదనపల్లె వన్ డిపో నుంచి ముదివేడుకు 27 బస్సులను నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రైవేటు వాహనాల్లో వెళ్లి ఇబ్బందులు పడకుండా, అధిక చార్జీలతో ఆర్థికంగా నష్టపోకుండా స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామని తెలిపారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ సిబ్బంది అందుబాటులో ఉంటూ అసౌకర్యం కలగకుండా బాధ్యతగా వ్యవహరిస్తారని వివరించారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి


రాజశేఖర్ మృతదేహం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు మండలంలోని బి. ఎర్రగుడి పంచాయతీ చంచర్లపల్లెకు చెందిన వండాడి రాజశేఖర్ (28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం మామిడి చెట్లకు ట్యాంకర్ ద్వారా నీరందించేందుకు వెళుతుండగా, దారిలోని మలుపులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రెండేళ్ల క్రితం అతని భార్య మృతి చెందడంతో రెండో వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె నిండు గర్భిణి అని వారు వివరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

ముగ్గురి బైండోవర్


బైండోవర్ చేసిన వ్యక్తులతో ఎస్ఐ వరుణ్‌కుమార్

ఓబులవారిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వై.కోటకు చెందిన ముగ్గురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వరుణ్‌కుమార్ తెలిపారు. వై.కోట గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య, చలపతి, పెంచలయ్య గతంలో నాటుసారా తయారీ కేసుల్లో నిందితులుగా ఉన్నారని, వీరిని ఓబులవారిపల్లె తహసీల్దారు శ్రీధర్‌రావు ఎదుట హాజరుపరిచి బైండోవర్‌కు సంబంధించి నిబంధనలు తెలియజేసి విడిచిపెట్టినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ వరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక యువతి అనుమానాస్పద మృతి

● రాత్రికిరాత్రే మృతదేహం తరలింపు

● ఆలస్యంగా వెలుగులోకి.. ● హత్యా... ఆత్మహత్యా?

గుర్రంకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడుకు చెందిన ఓ మిల్‌లో కర్ణాటక రాష్ట్రం బెల్గాంకు చెందిన కుమార్, సంగీత(21) దంపతులు ఏడాదిన్నరగా కూలి పనులు చేస్తున్నారు. ఈ మధ్య వారు తరచూ గొడవపడుతున్నట్లు సమాచారం. గత నెలలో శివరాత్రి నాడు భర్త ఇట్లో లేని సమయంలో సంగీత ఉరి వేసుకొని మృతి చెందింది. విషయాన్ని కుమార్ తన తోటి కూలీలు, యజమానికి చెప్పడంతో రాత్రికిరాత్రే ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో మృతదేహాన్ని బెల్గాంకు తరలించారు. ఈ విషయం ఆలస్యంగా బయటకు రావడం పలు అనుమానాలు రేకెత్తించింది. కాగా యువతి మృతికి గల కారణాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అలాగే అనుమానం ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా, సంగీతది ఆత్మహత్యా, హత్యా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

రాయచోటి సబ్‌జైలు పరిశీలన



రాయచోటి సబ్‌జైల్లో రికార్డులను పరిశీలిస్తున్న కడప కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

రాయచోటి టౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచనల మేరకు సెక్రటరీ- కం- సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ సోమవారం రాయచోటి సబ్‌జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. లీగర్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు ఏదైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరిండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

ముద్దు గుమ్మలు కాదు.. దిష్టి బొమ్మలు..!




రైల్వేకోడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పొలాలకు దృష్టిదోషం తగులకుండా నల్లకుండలకు దిష్టి చుక్కలు పెట్టేవారు. తర్వాత గడ్డితో తయారు చేసిన బొమ్మలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం సినీ తారల అర్ధనగ్న చిత్రాలను పొలాల మధ్యలో పెడుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడి, బొప్పాయి, అరటి, దోస, కర్బూజా తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఎక్కువగా దిగుబడులు వచ్చినపుడు దృష్టిదోషం తగులకుండా దిష్టిబొమ్మలను ఏర్పాటు చేసేవారు. కాలాను గుణంగా రైతులూ మారిపోయారు. బికినీలతో ఉన్న సినీతారల చిత్రాలను దిష్టి బొమ్మ లుగా ఏర్పాటు చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో రోడ్డు పొడవునా ఉన్న పొలాల్లో ఇలాంటి దృశ్యాలు ఆ మార్గంలో వెళుతున్న వారిని ఆకట్టుకుంటున్నాయి.

50 వసంతాల బడి..!


ములకలచెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాల

- ములకలచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటై 50 ఏళ్లు పూర్తి
- ఇక్కడ చదువుకున్న విద్యార్థుల్లో ఎందరో ప్రముఖులు
- స్వర్ణోత్సవాలకు సన్నాహాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల. ఇక్కడ చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారు ఎందరో ఉన్నారు. ఎందరికో అక్షరాలు నేర్పిన ములకలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకుంది. ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరిపితే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ములకలచెరువులోని పీటీఎం రోడ్డులో 1974-75 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. పాఠశాల ప్రాంగణం ఎంతో విశాలంగా ఉంటుంది. ఆటస్థలం, పచ్చని చెట్ల మధ్య పాఠశాల ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. 50 ఏళ్ళుగా 10వేల మంది ఇక్కడ చదువుకున్నారు. ఈ పాఠశాలలో చదివిన శ్రీనివాసులునాయక్ ప్రస్తుతం శ్రీ కాళహస్తిలో జిల్లా కోర్టు జడ్జిగా ఉన్నారు. అలాగే శివశంకర్‌రెడ్డి బెంగళూరులో డీఎస్పీగా పని చేస్తున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఇక్కడే చదివారు. అలాగే ఇక్కడ చదువుకున్న గోట రామచంద్ర, అమరనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నౌషాద్, సుధాకర్‌రెడ్డి, ఆనందరెడ్డి,ఖాదర్‌బాషా, మహమ్మద్‌రఫీ తదితరులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. ఇలా ఎంతో మంది ఇక్కడే చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు.

ఇక్కడే చదివి... ఇక్కడే విధులు

ములకలచెరువుకు చెందిన పూల కృష్ణారెడ్డి ప్రస్తుతం పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన 1976 నుంచి 1981 వరకు ఇక్కడే చదువున్నారు. ఆయన చదువుకునే సయమంలో స్కూల్ ఫస్ట్‌గా నిలిచాడు. ప్రస్తుతం తాను చదువున్న పాఠశాలలోనే ఆయన హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్నారు.

త్వరలో పూర్వ విద్యార్థులతో సమావేశం

పదవ తరగతి పరీక్షల అనంతరం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించేందుకు హెడ్మాస్టర్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో వేడుకల నిర్వహణపై చర్చించునున్నారు.

పాఠశాల ఏర్పాటై 50 వసంతాలు పూర్తి..



ములకలచెరువు జడ్పీ హైస్కూల్ 1974-75 లో ఏర్పడింది. గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. పూర్వ విద్యార్థులు ముందుకొస్తే బాగుంటుంది. నేను ఇదే పాఠశాలలో చదువుకున్నాను. ఇక్కడే చదువుకుని హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న సమయంలో పాఠశాలకు 50 ఏళ్ల పూర్తి కావడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

- కృష్ణారెడ్డి, హెడ్మాస్టర్, జడ్పీ హైస్కూల్

ఎంతో సంతోషంగా ఉంది



ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదువుకుని పారిశ్రామిక వేతగా ఎదిగాను. పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు సహాయ, సహకారాలు అందిస్తాను. పాఠశాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాను. ప్రభుత్వ సహకారంలో పాఠశాలలో అన్ని వసతుల కల్పనకు కృషి చేస్తాను.

- దాసరిపల్లి జయచంద్రారెడ్డి, పూర్వ విద్యార్థి

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఎస్పీ

కడప క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. సంబంధిత అధికారులకు ఫోను ద్వారా వారి సమస్యలను తెలిపి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు సమస్యను ప్రశాంతంగా వివరించడానికి సిబ్బంది సహాయం చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

అత్యాధునిక పిచ్ రోలర్ ప్రారంభం



పిచ్ రోలర్‌ను డ్రైవ్ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప నగరంలోని పోలీసు క్రికెట్ స్టేడియంలో అత్యాధునిక పిచ్ రోలర్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న పిచ్‌ను క్రికెట్ టోర్నమెంట్లకు అనుకూలంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా రోలర్‌ను తెప్పించారు. రోలర్‌కు జిల్లా ఎస్పీ పూజ నిర్వహించి స్వయంగా డ్రైవ్ చేసి పరిశీలించారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది క్రీడల ద్వారా నూతనోత్తేజం పొందవచ్చని, స్టేడియంను సద్వినియోగం చేసకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ ఇతరులు కూడా స్టేడియాన్ని అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవచ్చని, వివరాలకు 9121100641 లేదా 9000144343 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేలం ద్వారా 'గండి'కి రూ.1.75 లక్షల ఆదాయం

చక్రాయపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. కౌలుదారులకు, షాపింగ్ కాంప్లెక్స్, సులభ్‌కాంప్లెక్స్, పాలు, పెరుగు సరఫరా, నిత్యాన్నదాన పథకానికి కావాల్సిన కూరగాయలకు వేలం పాట నిర్వహించారు. ఇడుపులపాయలో 469 సర్వేనెంబర్‌లో 8.72 ఎకరాల భూమి మూడు సంవత్సరాలు కౌలు చేసుకోవచ్చు, అందులో ఏడాదికి ఇడుపులపాయకు చెందిన మహేష్ రూ.1.51 లక్షలు అత్యధికంగా పాడి పాట దక్కించుకున్నారు. మూడేళ్ల క్రితం ఈ భూమి కౌలు ఏడాదికి రూ.30వేలు పాడారు. వీరన్నగట్టుపల్లె సమీపంలో 0.98 ఎకరాల భూమిని ఆర్.తేజేశ్వర్ రూ.4వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. సులభ్ కాంప్లెక్స్‌కు ఇడుపులపాయకు చెందిన వెంకటరత్నం ఏడాదికి రూ.20 వేలకు దక్కించుకున్నారు. కూరగాయలకు, పాలు, పెరుగుకు టెండర్‌లో సరైన ధర లేకపోవడంతో నిలుపుదల చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్, కడప దేవాదాయశాఖ తనిఖీదారు శివయ్య, ఆర్కే వ్యాలీ పోలీసులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ, ఎంఈడీ పరీక్షలు ప్రారంభం



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని కేంద్రాల్లో బీఈడీ, ఎంఈడీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఈడీ పరీక్షలకు 4463 మంది విద్యార్థులు, ఎంఈడీ పరీక్షలకు 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, విజయలక్ష్మి బీఈడీ కళాశాల పరీక్ష కేంద్రాలను విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు, అబ్జర్వర్లు ఆచార్య మాధవి, ఆచార్య రియాజ్ ఉన్నీసా ఆకస్మికంగా తనిఖీ చేశారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచనలిచ్చారు.

ప్రారంభమైన లా పరీక్షలు

యోగివేమన విశ్వవిద్యాలయం పరధిలోని మూడు, ఐదేళ్ల లా కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు సోమవారం యోగవేమన విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ 3,5 సెమిస్టర్లు, ఐదేళ్లకు సంబంధించి 3,5,7,9 సెమిస్టర్లు చదువుతున్న విదార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 75 మంది విద్యార్థులు హాజరు కాగా మధ్యాహ్నం 173 మంది రాశారు. రిజస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షల ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమారి పర్యవేక్షించారు.


పదోన్నతుల్లో మాకు అన్యాయం

- ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఏఎన్‌ఎంల ఫిర్యాదు

చిత్తూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-3 ఏఎన్‌ఎంల పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందని మదనపల్లెలో పనిచేస్తున్న కొందరు ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి, డీఎంహెచ్‌వో సుధారాణిని కలిసి ఫిర్యాదు చేశారు. తామంతా మదనపల్లె మున్సిపాలిటీలో వార్డు సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీలుగా పనిచేస్తున్నామని చెప్పారు. గతనెల 21వ తేదీన ప్రమోషన్ లిస్ట్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిందన్నారు. అందులో తాము ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నామన్నారు. తర్వాత విడుదలైన ప్రమోషన్ ప్రపోజల్ కేటగిరీ లిస్టులో తమ పేర్లు లేవని తెలిపారు. అందులో తమకన్నా కింద ఉన్నవారి పేర్లు ఉన్నాయని చెప్పారు. విచారించి, న్యాయం చేయాలని కోరారు.

మత్తు కోసం...

- గాడి తప్పుతున్న మైనర్లు, యువత
- మాత్రలు, సొల్యూషన్, గంజాయి వినియోగం
- ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే విక్రయాలు
- రూ.20 విలువ చేసే మాత్ర రూ.500కు
- కొరవడుతున్న తల్లిదండ్రుల నిఘా



యువత మత్తు వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. తెలిసీ తెలియని వయసులో ఫ్యాషన్ పేరుతో సరదాగా సిగరెట్లు, మద్యం తో మొదలైన అలవాటు క్రమంగా గంజాయి, సొల్యూషన్, వైట్‌నర్ వంటి వాటిని పీలుస్తూ మత్తులో ఊగిపోతున్నారు. ఎక్కువగా 12 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్కులే ఇలాంటి మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతుండడం గమనార్హం. దీనిపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ప్రస్తావించడం గమనార్హం.

కడప (క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా మంది యువత మత్తు కోసం మద్యం, గంజాయితో పాటు ప్రమాదకరమైన మత్త పదార్థాలను వినియోగిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో యువకులు వీటికి అలవాటు పడుతున్నారు. చిన్నచౌకు, తిలక్‌నగర్, మాచుపల్లి రోడ్డులోని ఉక్కాయపల్లి డంప్‌యార్డు, బాలాజీనగర్, అల్మాస్ పేట, సాయిపేట, నకాష్, రవీంద్రనగర్, ఖలీల్ నగర్‌తో పాటు బుగ్గవంక కాలువ సైడ్‌వాల్ వంటి ప్రాంతాల్లో యువకులు మద్యం, గంజాయి లాంటి అలవాట్లే కాకుండా ఇప్పుడు ఎక్కువగా మత్తు ఎక్కించే ట్యాబ్లెట్లను వినియోగిస్తుండడం గమనార్హం. వీటిని కొన్ని మెడికల్ స్టోర్లలోనే కాకుండా సెల్‌పాయింట్లలో రూ.20విలువ చేసే మాత్రలు రూ.500లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విక్రయాలు


గంజాయికి అలవాడుపడిన యువకులు చిన్న చిన్న బ్యాచ్‌లను ఏర్పాటు చేసుకొని గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఒకప్పుడు గంజాయి చిన్న ప్యాకెట్ రూ.50 నుంచి వంద రూపాయాలు విక్రయించే వారు. ఇప్పుడు రూ.వెయ్యికి పైనే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి విక్రయించే వారు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని.. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా యథేచ్ఛగా విక్రయాలను సాగిస్తున్నారు. గంజాయి, ట్యాబ్లె ట్స్ అవసరం ఉన్న వారికి ఇన్‌స్ట్రాగ్రామ్ ఐడీని ఇస్తారు. ఎవరికీ అనుమానం రాకుండా ఎవరూ లేని చోటికి పిలిపించుకొని వారికి విక్రయిస్తారు. ఫోన్‌పే లేకుండా క్యాష్ ఉంటేనే ఇస్తా రు. దీంతో పోలీసులు వీరిని గుర్తించడం కష్టతరంగా మారుతోంది.

డాక్టరు ప్రిస్క్రిప్షన్లు లేకుండానే..

ప్రమాదకరమైన మత్తు ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు యువకులు తీసుకుంటున్నారు. వైద్యుల అనుమతి లేకుండానే ట్యాప్ ప్రీ ఈఆర్ 50, రెస్టల్ 0.5/0.25 ఎంజీ, క్లోనేట్రిల్ 0.5 లాంటి మాత్రలు వినియోగిస్తున్నారు. వీరిలో ఎక్కువగా మైనర్‌లే ఉన్నారు. ఇలాంటి వారు ఎక్కువ రోజులు జీవించలేక మధ్యలో ఆయూస్సు తీసుకుంటున్నారు. అటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇటు అధికారులు యువతపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా, ఇటీవల ఒన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నిఘా ఉంచి కొందరి యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా.. కర్నూలు జిల్లా నుంచి మత్తు ట్యాబ్‌లెట్స్ వస్తున్నట్లు గుర్తించారు. అలాగే మందుల షాపుల నిర్వాహకులకు ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణ కెమిస్ట్ అండ్ డ్రగ్స్ అధికారులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. అనుమతులు లేకుండా మత్తు మాత్రలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొరవడుతున్న తల్లిదండ్రులు నిఘా...

తమబిడ్డల పట్ల తల్లిదండ్రులు నిఘా లేకపోవడంతో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. పిల్లలు రాత్రిళ్ల ఎక్కడెక్కడ తిరుగుతున్నారు. ఎవరితో తిరుగుతున్నారో సరిగా పట్టించుకోకపోవడంతోనే పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఈ మత్తుకు బానిసలుగా మారిన యువకులు ఏం చేస్తున్నారో వారికే అర్థం కాక గొడవలకు పాల్పడుతున్నారు. మరికొందరు నిషా మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు.



డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి యువకులకు కోటింగ్ ఇస్తున్న పోలీసులు

డ్రోన్ కెమెరాలతో పోలీసు నిఘా

గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. కడప నగరం శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులను చూపుతున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి ఒకటిన్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వుల మేరకు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు సత్యనారాయణ, రవికుమార్‌లు సిబ్బందితో కలసి మున్సి పాలిటీ పరిధిలోని చెన్నంపల్లె ఎస్టీకాలనీ కాశినాయన గుడిదగ్గర అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న రాజుగారివీధికి చెందిన పండు మనోజ్‌కుమార్, వల్లెలవారిపల్లెకు చెందిన రాజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఒకటిన్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా చేసినా, అమ్మకాలు చేపట్టినా, వారికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బుగ్గవంక కాల్వలో వ్యక్తి మృతి

కడప క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తారక రామానగర్ సమీపంలోని బుగ్గవంక కాల్వలో పఠాన్ మాదర్‌ఖాన్ (60) అనే వ్యక్తి మృతి చెంది నట్లు తాలుకా ఎస్‌ఐ తాహిర్ హుసేన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. రాజుకాలనీకి చెందిన మాదర్‌ఖాన్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి... కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు విద్యుత్ శాఖ ఇంజినీర్లపై విచారణ

- మరో లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మ్యాన్‌లపై కూడా..
- ప్రెజెంటింగ్ అధికారిగా కడప ఏసీబీ సీఐ నాగరాజు నియామకం

కలికిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడి పక్కా ఆధారాలతో ఏసీబీకి చిక్కిన మైదుకూరు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఇంజినీర్లు, ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, మరో లైన్‌మ్యాన్‌లపై ఏపీ ఎస్పీడీసీఎల్ విచారణకు నిర్ణయించింది. మైదుకూరు విద్యుత్‌శాఖ ఏఈఈ కార్యాలయంలో 2022 మార్చి 30న ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పలువురు ఇంజినీర్లు, ఉద్యోగుల అవినీతికి సంబంధించి ఫిర్యాదులు అందడంతో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. ఫలితంగా మైదుకూరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎ.రామభద్రయ్య, మరో ఏఈఈ చౌడమ్ హరికృష్ణ, జూనియర్ ఇంజినీరు జి.రాజకుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ సింగారపు జయరాజు, లైన్‌మ్యాన్ ఎస్.నాగరాజ రెడ్డిలు అవినీతికి పాల్పడినట్లు ఏసీబీ తనిఖీల్లో వెల్లడయ్యింది. దీనిపై పలు అభియోగాలతో కేసు నమోదు చేసి తరువాత చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించింది. ఏసీబీ నమోదు చేసిన అభియోగాలకు సంబంధించి పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం శాఖపరంగా తగిన విచారణ చేపట్టాలని ఎస్పీడీసీఎల్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణకు తగిన ఆధారాలను, వివరాలను ఏసీబీ తరఫున విచారణ అధికారి ముందుంచేందుకు ప్రెజెంటింగ్ అధికారిగా కడప ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి.నాగరాజును నియమించాలని ఏసీబీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తూ విచారణాధికారులకు సహకరించేందుకు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ నాగరాజును నియమిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

నాలుగేళ్లయినా పూర్తి కాని భవన నిర్మాణాలు

- పొలాల మధ్య భయాందోళనలో ఉంటున్న విద్యార్థినులు
- మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

పులివెందులటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండల కేంద్రంలో బాలికల బీసీ వసతిగృహం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండలిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కిందట బాలికల బీసీ వసతిగృహం మంజూరైనా.. ఇప్పటికీ నిర్మాణ పనులు పూర్తి కాలేదన్నారు. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టరు కూడా పనులు ఆపివేసి వెళ్లిపోయారన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా పులివెందుల పట్టణ శివార్లలో పొలం వద్ద భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారని.. అక్కడ సరైన రక్షణ లేక పాములు వస్తుండడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో మంత్రి సందర్శించారని.. అక్కడ బాలికలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారన్నారు. త్వరితగతిన పూర్తి చేసి వచ్చే అకడమిక్ ఇయర్ కన్నా విద్యార్థినులకు నూతన భవనాలు అందుబాటులోకి వచ్చేలా చేయాలని కోరారు. ఇందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు.

జ్యోతిక్షేత్రంలో కూల్చివేసిన నిర్మాణాలను వెంటనే పునర్‌నిర్మించాలి



నిరసన కార్యక్రమంలో కాశినాయన భక్తిపాటలు ఆలపిస్తున్న భక్తులు

కడప మారుతీనగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టైగర్ జోన్‌కు దగ్గరగా ఉందనే నెపంతో లక్షలాది మంది మనోభావాలు దెబ్బతినేలా ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాశిరెడ్డినాయన జ్యోతి క్షేత్రంలో గత కొన్ని సంవత్సరాలుగా గల ఆశ్రమ వసతి గృహాలను అటవీశాఖ అధికాలు కూల్చివేయడం బాధాకరమని హిందూస్ ఫర్ ప్లూరలిటీ ఈక్వాలిటీ అన్నమయ్య కళాక్షేత్రం జైభారత్ ప్రతినిధులు పేర్కొన్నారు. తక్షణమే కూల్చివేసిన నిర్మాణాలను పునఃనిర్మించాలని డిమాండ్ చేశారు. హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ, అన్నమయ్య కళాక్షేత్రం, జైభారత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి కాశినాయన భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి, జైభారత్ జాతీయ ఉపాధ్యక్షుడు వంశీ, రాష్ట్ర అధ్యక్షుడు అరవింద్, నాయకులు గొల్లపల్లి గురవయ్య, కె.నాగభూషణం, రామయ్య మాట్లాడారు. కులమతాలకు అతీతంగా నిత్యం వేలాది మంది భక్తులచే పూజలందుకుంటున్న కాశిరెడ్డి నాయన క్షేత్రం నల్లమల్ల అటవీ ప్రాంత టైగర్ జోన్‌కు దగ్గరలో ఉందనే సాకుతో కేంద్రప్రభుత్వం అక్కడి నిర్మాణాలను కూల్చివేయడం సరైంది కాదన్నారు. దాతలు భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఆశ్రమ కట్టడాలైన గోశాల, పూలతోట, తొలగించడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు త్వరితగతిన స్పందించి అటవీశాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకునేలా చేయాలన్నారు. భక్తుల మనోభావాలు గౌరవించి కట్టడాలను పునర్‌నిర్మించాలని కోరారు.

న్యాయం జరగలేదంటూ...

కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం - అడ్డుకున్న పోలీసులు

కడప కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలలైనా న్యాయం జరగలేదంటూ సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిలో జాయింట్ కలెక్టర్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకుని పెట్రోల్ బాటిల్ లాక్కొని బయటకు తీసుకెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చాపాడు మండలం నక్కలదిన్నెకు చెందిన బాధితుడు విశ్వనాథరెడ్డి బయట మీడియాతో మాట్లాడుతూ గతేడాది అక్టోబరులో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో తన భార్య శెట్టిపల్లి శివలక్ష్మికి ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగిందన్నారు. అయితే ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియారాణి నిర్లక్ష్యంగా కారణంగా తన భార్య పేగుకు రంధ్రం పడటంతో ప్రాణాల మీదకు వచ్చిందన్నారు. సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయించి ప్రాణాలు కాపాడుకున్నామన్నారు. తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదంటూ మూడు నెలలుగా ఐఎంఏకు, కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు, డీఎం అండ్ హెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదన్నారు. తన భార్యకు ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియా రాణిపై చర్యలు తీసుకోవాలంటూ డీఎం అండ్ హెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తే అవగాహన రాహిత్యం వల్ల, ఆపరేషన్ సమయంలో పేగుకు రంధ్రం పడిందని తప్పు జరిగుండొచ్చని డాక్టర్ ఇలియా రాణిని కాపాడే విధంగా రిపోర్టు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ ఇలియారాణి భర్త డాక్టర్ రవికుమార్ కూడా స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తూ తప్పుడు రిపోర్టులతో ప్రజలను మోసం చేస్తున్నారని, వీరందరిపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు.

డాక్టర్‌పై చర్యలకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు జేసీ ఫోన్

అనంతరం కలెక్టరేట్ సభాభవన్‌లో బాధితురాలు విశ్వనాథరెడ్డి భార్య శివలక్ష్మి ఫిర్యాదు మేరకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజును పిలిపించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. నాగరాజు వివరణ ఇస్తూ.. బాధితురాలి ఫిర్యాదు మేరకు గతంలో కమిటీ వేశామని, ఆ కమిటీలో గైనకాలజిస్టు, సర్జన్, రేడియాలజిస్ట్‌లు విచారణ చేసి రిపోర్టు ఇచ్చారన్నారు. ఆ నివేదికలను వెంటనే చర్యలకై డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు కూడా పంపినట్లు తెలిపారు. ఏదైనా సర్జరీలు జరిగితే 1 శాతం మేర వ్యత్యాసాలు జరగవచ్చన్నారు. ఆ విషయంపై తాను డాక్టర్‌ను వెనకేసుకొస్తున్నట్లు ఆరోపణలు చేయడం సరికాదని జేసీకి వివరణ ఇచ్చారు. అయినప్పటికీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కమిషనరుకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఫోన్ చేసి ట్యూబెక్టమీ చేసిన డాక్టర్ ఇలియారాణిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కడప కలెక్టరేట్ సభాభవన్‌లో మీద పెట్రోల్ పోసుకున్న విశ్వనాథరెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు





మీద పెట్రోల్ పోసుకున్న విశ్వనాథరెడ్డిని ఆసుపత్రికి తీసుకెళుతున్న పోలీసులు, తమకు జరిగిన అన్యాయం గురించి జేసీ అదితిసింగ్‌కు వివరిస్తున్న బాధితురాలు శివలక్ష్మి

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

● పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ● పకడ్బందీగా నిర్వహణ



మదనపల్లె బాపూజీ మున్సిపల్ స్కూల్ వద్ద పరీక్ష గదులను చూసుకుంటున్న విద్యార్థులు

మదనపల్లె అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలుసోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి విద్యార్థులందరూ తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో ఎటువంటి ఇబ్బందికర సంఘటనలు జరగలేదు. మదనపల్లె డివిజన్‌లోని 50కేంద్రాల్లో 9294 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 9188 మంది హాజరు కాగా 106 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

నిమ్మనపల్లిలో..

నిమ్మనపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక జడ్పీహైస్కూల్(తెలుగు)లో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా జరినట్లు పరీక్షల చీఫ్ బాసుబ్రమణ్యం తెలిపారు. మోడల్‌స్కూల్, కేజీబీవీ, రెడ్డివారిపల్లి, బాలినాయునిపల్లి, ఉర్దూ పాఠశాల, నిమ్మనపల్లిలో 326మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సివుండగా 319మంది హాజరు కాగా ఏడుగురు గైహజరైనట్లు తెలిపారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని జడ్పీ బాలురు, బాలికల పాఠశాలలు, మోడల్‌స్కూల్, చైతన్య, విద్యార్థి ప్రైవేటు స్కూళ్లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 860 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుండగా 855 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.




ములకలచెరువులో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

ములకలచెరువులో...

ములకలచెరువు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ములకలచెరువు జడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, బురకాయలకోట జడ్పీ హైస్కూల్, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాల్లో మొత్తం 706 మంది విద్యార్థులకు గానూ 10 మంది గైర్హాజరయ్యారు.

పీలేరులో..

పీలేరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలంలో 9పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో సోమవారం 1509 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1500 మంది హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ నేతృత్వంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, ఉర్దూ హైస్కూల్, మండలంలోని చింతపర్తి జడ్పీ హైస్కూల్ కేంద్రాలుగా పరీక్షలు నిర్వహించారు. మొత్తం 637మంది విద్యార్థులకు గాను 631మంది హాజరయ్యారని ఎంఈవో వెంకటలక్ష్మి తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 122 మంది విద్యార్థులకు గానూ 121 మంది, మోడల్ స్కూల్‌లో 139 మందికి గానూ 138 మంది హాజరైనట్లు ఎంఈవో త్యాగరాజు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండలోని జడ్పీహైస్కూల్ (తెలుగు) పరీక్షకేంద్రంలో 178 మందికిగానూ ఆరుగురు, జడ్పీ హైస్కూలు (ఉర్దూ) పరీక్షకేంద్రంలో 145 మందికిగానూ ముగ్గురు గైర్హాజరైనట్లు ఎంఈవో సురేంద్రబాబు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కలకడలో..

కలకడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటవారిపల్లె, కోన, ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాలో మొత్తం 449 మందికిగానూ 439 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో మునీంద్రనాయక్ తెలిపారు.కాగా బాటవారిపల్లె పరీక్ష కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ రమాదేవి తనిఖీ చేశారు.

కలికిరిలో..

కలికిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కలికిరి మండలంలో 514మంది విద్యార్థులకు గానూ 10 మంది గైర్హాజరయ్యారు. మండలంలో ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, మహల్ ఉర్దూ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలో సమస్యాత్మక పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన 8 కేంద్రాల్లో ఒకటయిన కలికిరి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో కూడా మొదటి రోజు పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా జరిగాయి.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల హైస్కూల్ పరీక్షా కేంద్రాల్లో సోమవారం 425 మంది విద్యార్థులకుగాను 17మంది గైర్హాజరైనట్లు ఎంఈవో మనోహర్ తెలిపారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో గదుల్లోని బయట కిటికిలు మూసేయంతో విదార్థులు కొత్త ఇబ్బందులు గురైనట్లు పలువురు విద్యార్థులు వాపోయారు.


పెద్దమండ్యం పరీక్ష కేంద్రంలో గదుల బయట కిటికీలు మూసిన దృశ్యం

కురబలకోటలో..

కురబలకోట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ప్రారంభమైన టెన్త్ పరీక్షలకు 589 మంది విద్యార్థులకుగానూ 584 మంది హాజరైనట్లు ఎంఈవో ద్వారకనాథ్ తెలిపారు. మండలంలోని కురబలకోట, ముదివేడు జడ్పీ హైస్కూల్ కేంద్రాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో, తదితరులు తనిఖీ చేశారు.


గుర్రంకొండలో..

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



ప్రజా సమస్యలపై వెల్లువెత్తిన అర్జీలు

● పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌కు డివిజన్ నలుమూలల నుంచి 98 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించారు. హంద్రీనీవా కాలువతో తమ వ్యవసాయ భూములకు వెళ్లే మార్గం కష్టంగా వుందని, ఈ కాలువపై బ్రిడ్జి నిర్మించాలని పీటీఎం మండలం, గడ్డంవారిపల్లె రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. రామసముద్రం మండలం చిట్టెంవారిపల్లెలో హౌసింగ్ పథకంలో నిర్మించుకున్న ఇంటిని తహసీల్దార్ తొలగించాలని ఆదేశించారని, శ్మశానవాటిక స్థలంలో ఇల్లు నిర్మించారని బెదిరిస్తున్నారని బాధితురాలు ఎం.సునీత ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో ప్రభుత్వ వాటర్ ప్లాంటులో వాటర్ క్యాన్ రూ.2బదులు రూ.5 వసూలు చేస్తున్నారని గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. వీటిపై సబ్‌కలెక్టర్ స్పందిస్తూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలు, ఫిర్యాదులు నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని, ఆయా మండలాల ప్రభుత్వశాఖల అధికారులను ఆదేశించారు.

ఓటర్లకు అందుబాటులో పోలింగ్ స్టేషన్‌లు

ఓటర్ల నివాసాలకు రెండు కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్‌స్టేషన్లు వుండేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ఏఈఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్లు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి బీఎల్‌వోల సహకారంతో కొత్త ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. 800 నుంచి 1200 మించి ఓటర్లు వున్న పోలింగ్‌స్టేషన్‌లను గుర్తించి వాటిని విభజించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకచోట, చట్టసభల ఎన్నికల్లో మరోచోట పోలిం గ్ స్టేషన్లు వున్నాయని రాజకీయ పార్టీ నాయకులు ఫిర్యాదు చేయగా, వాటిపై సబ్‌కలెక్టర్ వివరణ ఇచ్చారు. ఈ రెండు ఎన్నికలు వేర్వేరు అని, అలాంటి పోలింగ్ స్టేషన్‌లు మార్చడం కుదరదన్నారు. సమావేశంలో డీఏవో రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్లు ధనంజయులు, అమరనాథ, తదితరులు పాల్గొన్నారు.

'దళితుల భూముల పరిరక్షణకు సహకరించండి'

నిమ్మనపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళితుల భూముల పరిరక్షణకు సహకరించాలని మాలమహానాడు మండల నాయకులు తహసీల్దార్ అమరనాథ్‌ను కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా తహసీల్దార్‌ను కలసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు మండల అధ్యక్షుడు వీరణాల మాణిక్యం మాట్లాడుతూ ప్రభుత్వం తమ పెద్దలకు డికేటి పట్టాలను మంజూరు చేసిందని, చదువురాని తమ పెద్దల నుంచి కొందరు అగ్రవర్ణాలవారు వారి పేరున మార్చుకొన్నారని ఆరోపించారు. మండలంలోని ప్రభుత్వం భూమిని నిరుపేదలకు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాములు, యర్రయ్య, జయన్న పాల్గొన్నారు.

చాందినీ బండ్లకు పోలీసుల అనుమతి తీసుకోవాలి

కురబలకోట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో వెలసిన దండు మారెమ్మ జాతరలో చాందినీ బండ్ల ఊరేగింపునకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండి బయలుదేరినప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరుకునేవరకు నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే బండ్లకు డీజే, రికార్డింగ్ డ్యాన్స్‌లకు అనుమతులు లేవన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు

పెద్దమండ్యం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) వేసవిలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏడీ సురేంద్రనాయక్ వెల్లడించారు. మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో లోవోల్టేజీతో విద్యుత్ అంతరాయం లేకుండా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముసలికుంటలో కేపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్, తురుకపల్లిలో అడిషనల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా, కలిచెర్లకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పెద్దమండ్యం ట్రాన్స్‌కో ఏఈ రామ్మూర్తినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

● తహసీల్దార్‌కు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం వినతి

పీలేరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటన, గత పీఆర్‌సీ బకాయిలు వంటి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పీలేరు శాఖ అధ్యక్షుడు చంద్రారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డీఆర్ బకాయిలు, అడిషనల్ క్వాంటమ్‌ను పూర్వ పద్ధతిలో 70 సంవత్సరాలకు 10 శాతం, 75 సంవత్సరాలకు 15 శాతం పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈహెచ్ఎస్‌పై వైద్యం పూర్తిస్థాయిలో అందేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తహసీల్దారు భీమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి యర్రమరాజు, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న చంద్రారెడ్డి, తదితరులు

పంచాయతీ వేలం పాటను నిరుపేదలకు దూరం చేశారు

● టీడీపీ నేత కువైట్ ఆదినారాయణ

వాల్మీకిపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ వేలంపాటలను నిరుపేదలకు దూరం చేశారని స్థానిక టీడీపీ నాయకుడు కువైట్ ఆదినారాయణ పేర్కొన్నారు. మండలంలోని చింతపర్తి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ వనరులకు సంబంధించిన వేలంపాటలను సోమవారం పంచాయతీ కార్యదర్శి రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారపు సంత వేలంపాట పాడేందుకు రూ.లక్ష డిపాజిట్ ఉండగా ఒకేసారి రూ.4.5లక్షల డిపాజిట్‌గా నిర్ణయించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న వారికే వేలం పాటలు కట్టబెట్టే విధంగా డిపాజిట్ విధానం ఉందని ఆరోపించారు. సామాన్యులకు జరిగిన అన్యాయంపై సోమవారం ఆయన స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదిని సంప్రదించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పీలేరు ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా పూర్ణచంద్ర



పీలేరు, మార్చి 17: పీలేరు మండల ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా వాల్మీకిపురం సర్వేయర్ పూర్ణచంద్ర నియమితులయ్యారు. పీలేరు ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా ఉన్న కీర్తన వ్యక్తిగత కారణాల వల్ల సెలవు పెట్టడంతో ఆమె స్థానంలో పూర్ణచంద్రను జేసీ ఆదర్శ రాజేంద్రన్ నియమించారు.

ఎం.బుక్కుల అదృశ్యంపై సర్పంచ్, వార్డుసభ్యుల ఆగ్రహం

● అవి లేవని బిల్లుల చెల్లింపు నిలిపివేతపై అసహనం ● వాడీవేడిగా పీలేరు పంచాయతీ సాధారణ సమావేశం

పీలేరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అధికారుల కస్టడీలో ఉండాల్సిన ఎం.బుక్కులు (మెజర్‌మెంట్ పుస్తకాలు) అదృశ్యం కావడం ఏమిటని, అవి లేవని బిల్లులు చెల్లించకుండా ఉంటే ఎలా అని పీలేరు సర్పంచ్ డా.హబీబ్ బాషా, పలువురు వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ హబీబ్ అధ్యక్షతన సోమవారం పీలేరు పంచాయతీ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ పాలకవర్గ సభ్యులు తమ ప్రాంతాల్లో చేసిన పనులకు కూడా చెల్లింపులు నిలిపివేశారని ఈవో గురుమోహన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా పనుల ఎం.బుక్కులు తమ వద్ద లేవని, అప్పట్లో పనిచేసిన ఈవోలు వాటిని తనకు అప్పగించలేదని ఆయన వార్డుసభ్యులకు తెలిపారు. అయితే అప్పట్లో పనిచేసిన కిందిస్థాయి సిబ్బంది ఇప్పటికీ పనిచేస్తున్నారని, తాము ఇంజనీరింగ్ అధికారులతో చెక్ మెజర్‌మెంట్ చేయించి ఎం.బుక్కులను వారికి అందజేశామని తెలిపారు. దీంతో వారం రోజుల్లో పీలేరు పంచాయతీకి మంజూరైన ఎంబుక్కులు, ప్రస్తుతం కార్యాలయంలో అందుబాటులో ఉన్నవి, కనిపించకుండా పోయిన వాటి వివరాలు పూర్తిగా సేకరించాలని ఈవో తన సిబ్బందిని ఆదేశించారు. ఎం.బుక్కులు దొరికిన వెంటనే చెల్లింపుల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. పంచాయతీలో పనిచేస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్ల ఆపరేటర్లకు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడమే కాకుండా పంచాయతీ కార్యాలయ పరిధిలోని కార్మికుల వేతనాలు రూ.2 వేల మేర పెంచాలని సర్పంచుతోపాటు వార్డుసభ్యులు ఈవోను కోరారు. జిల్లా ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని జీతాల పెంపు అంశాన్ని పరిశీలిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. పంచాయతీలో పనిచేస్తున్న వాటర్ వర్క్స్ సిబ్బంది నెలకు 5 లీటర్ల ఉచిత పెట్రోలు అందించాలని, కార్యాలయ పైకప్పుపై ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మార్చాలని సర్పంచ్, వార్డుసభ్యులు ఈవోను కోరారు. ఈవో గురుమోహన్ మాట్లాడుతూ పెరిగిన ఎండల దృష్ట్యా పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని, సంత ప్రాంగణంలోని ఆక్రమణలు, నిరుపయోగంగా ఉన్న కట్టడాలను తొలగిస్తామని తెలిపారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు సోప్‌లు, యూనిఫాం బట్టలు అందజేశారు. అయితే పీలేరు పంచాయతీలో 20మంది వార్డు సభ్యులు ఉండగా సమావేశానికి 11 మంది హాజరయ్యారు. అందులోనూ కొంత మంది వార్డు సభ్యుల స్థానంలో వారి భర్తలు, తండ్రి హాజరవడం విశేషం. ఈ సమావేశంలో కార్యదర్శులు జ్ఞానశేఖర్, సంయుక్త, బావాజీ, శివాజీ, సిబ్బంది వరప్రసాద్ రెడ్డి, చంద్రకళ, టీడీపీ నేతలు అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, ఆర్‌బీఐ రమణారెడ్డి, నల్లారి రియాజ్, రెడ్డిముని, తదితరులు పాల్గొన్నారు.


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్, వార్డుసభ్యులు

రేపు వారపుసంత, బస్టాండు గేటు వేలం

నిమ్మనపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో ఉన్న వారపుసంత, బస్టాండు, షాపింగ్ రూములకు సంబంధించి ఈనెల 19న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఈ వేలంపాట జరుగుతుందని తెలిపారు. పాటదారులు ముందుగా రూ.2లక్షలు డిపాజిట్ చేయాలన్నారు. వివరాలకు 7013954625ను సంప్రదించాలని తెలిపారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండలో కొలువైన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచే జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి మల్లయ్యకొండకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో మునిరాజ, టీడీపీ నేత ఉత్తమ్‌రెడ్డి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.


వెండి నాగాభరణం అలంకరణలో మల్లికార్జున స్వామి

టీబీ నిర్మూలన అందరి బాధ్యత

● రేగళ్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి లక్ష్మీప్రసన్న

పీలేరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సమాజం నుంచి టీబీని పూర్తిగా నిర్మూలించడం అందరి బాధ్యత అని పీహెచ్‌సీ వైద్యాధికారిణి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. క్షయవ్యాధి వారోత్సవాల్లో భాగంగా సోమవారం రేగళ్లు గ్రామంలో టీబీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటే టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయిన వ్యక్తికి ప్రభుత్వం ఉచిత చికిత్స అందించడమే కాకుండా ఆరు నెలలు పాటు నెలకు రూ.వేయి అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పవన్ కుమార్, సీహెచ్‌వో జయలక్ష్మి, సిబ్బంది చిన్నప్ప, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.


టీబీపై అవగాహన కల్పిస్తున్న రేగళ్లు పీహెచ్‌సీ సిబ్బంది

వైభవంగా పాలేటమ్మ జాతర


చాందినీ బండిని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత

చిన్నమండెం, మార్చి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ దేవళంపేటలో వెలిసిన పాలేటమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండుగగా సాగింది. అమ్మవారికి మొక్కులు ఉన్న వారు 14 చాందినీ బండ్లు కట్టారు. చాందినీ బండ్లను వద్ద రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత ప్రారంభించారు. చెక్కభజనలు, కోలాటం, వివిధ వేషధారణలు, డప్పు వాయిద్యాలు కనువిందు చేశాయి.

భూమికి పచ్చని రంగేసినట్టు..

కనుచూపుమేర పరుచుకున్న ఈ పచ్చదనం చూస్తుంటే పుడమి తల్లికి పచ్చని రంగేసినట్లుగా కనిపిస్తోంది కదూ..! ప్రకృతి ప్రేమికుల మనసును కట్టిపడేసే కోనసీమ అందాలను తలపిన్న ఈ ప్రాంతం కరువుకు పేరొందిన తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె గ్రామం. చెరువు కింద వ్యవసాయ బోర్లతో ఈసారి ఎక్కువ మంది రైతులు వరి సాగు చేపట్టారు. దీంతో తంబళ్లపల్లె నుంచి పెద్దమండ్యం వెళ్లే రోడ్డులో గోపిదిన్నె కొత్తపల్లె బస్టాప్ తర్వాత ఓ రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు పక్కనున్న పంట పొలాలు వరి పైరుతో కళకళలాడుతూ కనువిందు చేస్తున్నాయి.

- తంబళ్లపల్లె (ఆంధ్రజ్యోతి)

